RNI No. : TELTEL/2019/79009

కొమురం భీమ్ విలేకరులు కావలెను
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజక వర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత యువ జర్నలిస్టులకు అవకాశం
రిపోర్టర్‌కు ఇ.ఎస్.ఐ. భద్రత ఉంటుంది
కొమురం భీమ్ Komuram Bheem తెలుగు డైలీ
సంప్రదించగలరు : 85220 24855

ఎడిటర్ : ముల్కల్ల ప్రసాద్

తెలుగు దినపత్రిక
# కొమురం భీమ్
ప్రజా సమస్యలపై అక్షర పోరాటం

సంపుటి : 7 | సంచిక : 120 | 5 జూన్ 2026 | SIMULTANEOUSLY PUBLISHED PEDDAPALLI AND HYDERABAD | శుక్రవారం | పేజీలు : 8 | వెల : 4

### ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు
## గ్రీన్ సిగ్నల్

**ఆదిలాబాద్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**



ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది . ఎయిర్ పోర్టుకు 1580 ఎకరాలు ఇవ్వడానికి సిద్ధమైన రాష్ట్ర సర్కార్ ప్రతిపాదన లేఖను రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ మహంతికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అందించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లేఖ పట్ల సానుకూలత తెలిపింది >> మిగతా..2లో

## రాష్ట్రంలో తగ్గని ఎండల తీవ్రత

- అంగన్‌వాడీ కేంద్రాలకు 14 వరకు సెలవులు
- 15న తిరిగి ప్రారంభించాలని ఆదేశాలు

**హైదరాబాద్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**

రాష్ట్రంలో భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా మే నెల ముగిసినా ఎండల తీవ్రత, వడగాల్పుల ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న పిల్లలు, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను పొడిగించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓఝా వేసవి సెలవులను జూన్ 13 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 14వ తేదీన ఆదివారం కావునా.. జూన్ 15 నుండి ఈ కేంద్రాలు యథావిధిగా తిరిగి పనిచేయడం ప్రారంభిస్తాయి. నిజానికి ముందస్తు ప్రణాళిక ప్రకారం జూన్ 2వ తేదీ >> మిగతా..2లో

### పాలమూరు ప్రాజెక్టులపై
# సీఎం రేవంత్ సమీక్ష

- పలు ప్రాజెక్టులను ఏరియల్ సర్వే చేసిన సీఎం
- ప్రాజెక్టుల స్థితిగతులపై అధికారులతో ఆరా

**మహబూబ్‌నగర్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమశిలలో ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా ఏరియల్ సర్వే నిర్వహించారు. ముఖ్యమంత్రి , మంత్రుల బృందం పాలమూరు జిల్లాలోని పలు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ఆకాశ మార్గం ద్వారా క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా కోయిల్ సాగర్ ప్రాజెక్ట్, కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదించిన నూతన బ్యారేజీల స్థలాలు, , జూరాల ప్రాజెక్టు డ్యామ్‌ను సీఎం రేవంత్ రెడ్డి వీక్షించారు. ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, నీటి నిల్వ సామర్థ్యం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గ పరిధిలోని కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పథకంలో అత్యంత కీలకమైన కాట్రేవుపల్లి పంప్ హౌస్ వద్ద జరుగుతున్న పనుల నిర్మాణ శైలిని, పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వీక్షించారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుండటంతో దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఏరియల్ సర్వే అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి రైతులకు



సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రుల బృందం కూడా ప్రాజెక్టుల వారీగా ఉన్న అడ్డంకులను తొలగించి, పనులను త్వరగా ముగించాలని అధికారులకు సూచించింది.

## కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

- ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ పరిశీలన
- త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

**నారాయణపేట, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**


మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. బీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి,



దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ >> మిగతా..2లో

## అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం

- కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు
- ఆస్తి, ప్రాణనష్టంపై అందని వివరాలు
- రంగంలోకి దిగిన ఫైర్ ఇంజన్లు, పోలీసులు
- అమీర్‌పేట-ఎస్సార్ నగర్ మధ్య ట్రాఫిక్ క్రమబద్దీకరణ


2

### ఎల్ నినో ప్రభావంపై
## రైతులకు అవగాహన

- వర్షాభావంపై సన్నద్ధం చేయండి
- వ్యవసాయాధికారులకు మంత్రి తుమ్మల సూచన


2



## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

- ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం
- అఖిలపక్ష భేటీలో కమిటీ ఛైర్మన్ కేశవరావు

**హైదరాబాద్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామని అన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, >> మిగతా..2లో



## కేరళను తాకిని నైరుతి రుతుపవనం

### మరో వారం రోజుల్లో తెలంగాణకు రాక

**తిరువనంతపురం, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్):**

ఇంతకాలం మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేలా చల్లని కబురు వచ్చేసింది. కేరళకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దాంతో కేరళ తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక అక్కడ ఇనుంచి తమిళనాడు, కర్నాటక,ఆంధ్రాలకు విస్తరిస్తాయి. మరో వారంలోపే ఈ రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది. అయితే గతంతో పోలిస్తే ఈసారి నైరుతి రుతుపవనాలు కొంత ఆలస్యంగా వచ్చాయి. వాస్తవానికి మే 26వ తేదీననే నైరుతి రుతపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా అంచనా వేసింది. కానీ, ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనాలు తలకిందులయ్యాయి. కాగా రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే కేరళలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో అటు తమిళనాడులోని 15 జిల్లాల్లోనూ రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరిక జారీచేసింది. ఇదిలావుంటే.. ఎల్‌నినో ప్రభావంతో >> మిగతా..2లో

## ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి డిమాండ్

**జగిత్యాల, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్):**

రాష్ట్ర ప్రజానీకంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆరోపించారు. వానకాలం పంట సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతున్నా గాని ప్రభుత్వానికి ముందస్తు కార్యచరణ ప్రణాళికను ఇంకా తయారు చేసుకోలేదని వెల్లడించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాలకు సంబంధించి కార్యచరణను ఇంకా రూపొందించ లేదని ఆరోపించారు. కనీసం ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలని



డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా మూడు సంవత్సరాల కాలంలో ఆరు పంటలు పండాయని, ఇందులో ఎన్ని పంటలకు రైతు భరోసా కల్పించారో ఆయన ఆత్మకే తెలుసని విమర్శించారు. ధాన్యం సేకరణపై కాంగ్రెస్ , బీజేపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రైతు గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. పప్పు దినుసులు, నూనె గింజలు >> మిగతా..2లో

## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు

- నేటి నుంచే అమల్లోకి పెంచిన రేట్లు
- రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం
- సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**

మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.



భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్ట్రార్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే >> మిగతా..6లో

### నగరంలో వరుసగా
## అగ్నిప్రమాదాలు

### ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం: తలసాని

**హైదరాబాద్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**



అగ్నిప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అమీర్ పేటలోని మైత్రివనం వద్ద అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. ప్రమాదం వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. >> మిగతా..6లో

కొమురం భీమ్
Komurambheem Telugu Daily
విశ్లేషణాత్మకం

# కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

(మొదటి పేజీ తరువాత)

ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు. ఘాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ -1 పనులను గురువారం పరిశీలించారు. ప్యాకేజ్ -1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీదర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాత)

కేంద్రం. రక్షణ శాఖ చెందిన 400 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే1580 ఎకరాలు కలిపి1980 ఎకరాల్లో ఎయిర్ ఫోర్స్ స్టేషన్, ఎయిర్ పోర్టు నిర్మాణానికి సానుకూలంగా ఉన్నట్లు కేంద్రం తెలిపింది. కేంద్రం నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై సానుకూలంగా ఉన్న ప్రధాని మోడీ, సీఎం రేవంత్ కు ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రంలో తగ్గని ఎండల తీవ్రత

(మొదటి పేజీ తరువాత)

నుంచే అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను పునఃప్రారంభించాలని ప్రభుత్వం భావించింది. అయితే, జూన్ మొదటి వారంలో కూడా ఉష్ణోగ్రతలు 40 నుండి 45 డిగ్రీల సెల్సియస్ దాటుతుండటం, మధ్యాహ్నం వేళల్లో తీవ్రమైన ఉష్ణగాలులు వీస్తుండటంతో తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. చిన్న పిల్లలు ఎండ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సైతం ఎండల తీవ్రత కారణంగా వేసవి సెలవులను పొడిగించిన సంగతి తెలిసిందే. పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాలను కూడా జూన్ 14 వరకు మూసి ఉంచాలని, విద్యాసంస్థలతో పాటే జూన్ 15న ఒకేసారి తెరవాలని ప్రభుత్వం భావిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారు 3 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలు కావడంతో వారికి రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో వారు బయటకు వస్తే వడదెబ్బ తగిలి డీహైడ్రేషన్, జ్వరం బారిన పడే అవకాశం ఉంది. అందుకే వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ప్రభుత్వం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకుంది. సెలవుల పొడిగింపు కేవలం చిన్న పిల్లల రాకకు మాత్రమే వర్తిస్తుంది. అయితే అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందే పౌష్టికాహారం పంపిణీకి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అంగన్‌వాడీ సిబ్బందితో పాటు, చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన అధికారిక మార్గదర్శకాలు, జీవో త్వరలోనే విడుదల కానున్నాయి.

## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

(మొదటి పేజీ తరువాత)

విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ పక్రియ అమరవీరుల ద్వీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తామన్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తామని పేర్కొన్నారు.

## ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలి

(మొదటి పేజీ తరువాత)

పండించాలని సలహా ఇస్తున్న ప్రభుత్వం వాటికి ఏ విధమైన ప్రోత్సాహం కల్పిస్తుందో చెప్పడం లేదని పేర్కొన్నారు. కోతుల బెడద నుంచి పంటలను కాపాడేందుకు కోతుల పునరుత్పత్తి నిలుపుదల కేంద్రాన్ని జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలని, తక్షణమే రైతుకు సోలార్ ఫెన్సింగ్ 50 శాతం రాయితీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్లో యూరియా అందుబాటులో లేదని, యూరియా యాప్‌ను తొలగించి నేరుగా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.





# అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం

- కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు
- ఆస్తి, ప్రాణనష్టంపై అందని వివరాలు
- రంగంలోకి దిగిన ఫైర్ ఇంజన్లు, పోలీసులు
- అమీర్‌పేట-ఎస్సార్ నగర్ మధ్య ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

**హైదరాబాద్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** హైదరాబాద్ అమీర్‌పేటలో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ - 1043 సమీపంలో ఉన్న కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటలు వేగంగా వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దట్టమైన పొగ కారణంగా పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. భవనంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కూడా కొనసాగాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయంపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా అమీర్‌పేట నుంచి ఎస్సార్ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పరిసర ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఇతర మార్గాల వైపు మళ్లిస్తూ పరిస్థితిని నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు, వాహనదారులు అమీర్‌పేట- ఎస్సార్‌నగర్ మార్గాన్ని తాత్కాలికంగా నివారించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని అధికారులు సూచించారు. అలాగే విధుల్లో ఉన్న ట్రాఫిక్, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర సేవల సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

# ఇండియా కూటమికి బీటలు

- 8వతేదీ ఇండీ కూటమిని బహిష్కరించిన డీఎంకె
- హాజరు కాబోవడం లేదని ప్రకటన విడుదల

**న్యూఢిల్లీ, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇందులో భాగస్వామి అయిన డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 8వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే ఇండియా కూటమి సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పాల్గొనే ఈ భేటీకి వెళ్లే ప్రసక్తే లేదంటూ చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ తమకు తీవ్ర ద్రోహం చేసిందంటూ డీఎంకే సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ పార్టీ వైఖరితో డీఎంకే శ్రేణులు తీవ్ర మనస్తాపం చెందాయని వివరించింది. అందులో భాగంగా కేడర్ భావాలను గౌరవిస్తూనే ఇండియా కూటమి భేటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది. జూన్ 8వ తేదీన ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వేదికగా ఇండియా కూటమి అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కూటమి సమావేశానికి హాజరు కావాలని ఆ పార్టీ భాగస్వామ్య కూటమిల నుంచి డీఎంకేకు ఆహ్వానం అందింది. అయినప్పటికీ.. హాజరు కాకూడదని డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రవర్తించిన తీరుపై డీఎంకే శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వచ్చింది. తమ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాన్ని క్షమించేది లేదంటూ డీఎంకే ఒక ప్రకటన విడుదల చేసిన విషయం విదితమే. ఇండియా కూటమి ఏర్పడినప్పటి నుంచి డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా డీఎంకే గుర్తు చేసింది. నీట్, ఒకే దేశం-ఒకే సారి ఎన్నికలు, వక్ఫ్ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తమ పోరాటం కొనసాగుతుందని డీఎంకే వెల్లడించింది. కూటమితో భేటీకి దూరంగా ఉన్నప్పటికీ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఇతర పార్టీల పోరాటాలకు మద్దతు ఇస్తామని డీఎంకే ప్రకటించింది. దీంతో డీఎంకే - కాంగ్రెస్ బంధంలో వివాదం ముదిరినట్లు అయింది. అంతేకాకుండా జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమికి డీఎంకే భారీ షాక్ ఇచ్చినట్లు అయింది.

# ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన

- వర్షాభావంపై సన్నద్ధం చేయండి
- వ్యవసాయాధికారులకు మంత్రి తుమ్మల సూచన



**హైదరాబాద్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు స్పష్టం చేశారు. పంట వ్యర్థాలను కాల్చడంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు చెప్పారు. రూ. 2,284.32 కోట్లతో కొహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. జూన్ 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇక వ్యవసాయశాఖకు చెందిన ఖాళీ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ ఆస్తుల రక్షణ కోసం ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాళీ స్థలాల్లో ఎ÷-లాంటేషన్ లేదా లీజు ద్వారా ఆదాయం సమీకరణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఫెర్టిలైజర్ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రశంసలు కురిపించిందని చెప్పారు. తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ అమలుకు తెలంగాణను పైలట్ రాష్ట్రంగా ఎంపిక చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యాప్ సమర్థ అమలుకు రాష్ట్రానికి ప్రోత్సాహకాలు అందిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సేవలు అందించాలని వారికి మంత్రి పొంగులేటి సూచించారు.

## పవన్ కళ్యాణ్‌పై మరోమారు ప్రకాశ్ రాజ్ సెటైర్లు

### ఘాటుగా తిప్పికొట్టిన నిర్మాత బండ్ల గణెళిశ్

**హైదరాబాద్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అంశంలో నటుడు ప్రకాశ్ రాజ్, నిర్మాత బండ్ల గణెళిశ్ మధ్య సోషల్ మీడియా ఎక్స్‌లో వార్ నడుస్తోంది. తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై ప్రకాశ్ రాజ్ సెటైర్ వేస్తే.. ప్రకాశ్ రాజ్‌కు బండ్ల గణెళిశ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో జనసేన పోటీపై ఎక్స్‌లో పోస్ట్ చేసిన ప్రకాశ్ రాజ్.. పవన్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'మీరొస్తామంటే మేమొద్దంటామా.. రండి దొర. సింగిల్‌గా వస్తున్నారా.. పొత్తుతో వస్తున్నారా చెప్పి రండి' అని ప్రకాశ్ రాజ్ పోస్ట్ చేశారు. ప్రకాశ్‌రాజ్ పోస్ట్‌కు బండ్ల గణెళిశ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రతి దాంట్లో ఎందుకు వేలు పెడతావంటూ ప్రశ్నించారు. 'అసలు నువ్వెవరు.. తమిళోడివా? తెలుగోడివా? కన్నడిగుడివా? ప్రతి విషయంలో జడ్జిమెంట్ ఇవ్వడానికి నువ్వేమైనా ప్రధానివా. అందరి విషయాల్లో దూరి హీరోలా ఫీలవ్వకు. ముందు నీ అడ్రస్ నువ్వు తెలుసుకో. తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయ్' అంటూ ప్రకాశ్ రాజ్‌ను ఉద్దేశించి బండ్ల గణెళిశ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రకాశ్ రాజ్, బండ్ల గణెళిశ్ మధ్య సోషల్ మీడియా ఎక్స్ వేదికగా జరుగుతున్న వార్.. చర్చనీయాంశంగా మారింది.

## కేరళను తాకిని నైరుతి రుతుపవనం

(మొదటి పేజీ తరువాత)

ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో (జూన్-సెప్టెంబర్) సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే 90శాతం వర్షమే ఈ సీజన్‌లో కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని, జూన్‌లో ఇవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్‌లో మాత్రం బలంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

## రేవంత్ పర్యటన..ముందుస్తు అరెస్ట్‌లు

**జోగులాంబగద్వాల, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం గద్వాల జిల్లాలో పర్యటన సందర్భంగా పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. గద్వాల నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు నాయుడును పోలీసులు అర్ధరాత్రి నుంచి హౌస్ అరెస్ట్ చేశారు. అదేవిధంగా పార్టీ సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్ రాములు, కురువపల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్‌ను అరెస్టు చేయడం పట్ల హనుమంతు నాయుడు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో పోలీస్‌ల పహారాలు, నిర్బంధాలు ఎందుకని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం అంటూ బీరాలు పలుకుతూ ప్రతిపక్ష నాయకులపై అంక్షలు ఎందుకని నిలదీశారు. మూడు సంవత్సరాల పాలనకే ఇంత అభద్రతాభావమా.. ఇంతటి అరాచకమా? అని మండిపడ్డారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రతిపక్ష పార్టీల సూచనలను, ప్రజల ఆలోచనలను పరిగణనలోకి తీసుకోకుండా హడావుడిగా ప్రాజెక్టుల సందర్శన చేపట్టడం విచారకరమని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండించారు.

## పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం

### విజయవాడ రహదారిపై ట్రాఫిక్ చిక్కులు

**హైదరాబాద్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** హయత్‌నగర్‌లో పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ లక్ష్మారెడ్డి పాలెం దగ్గర కారును ఢీకొట్టి పెట్రోల్ ట్యాంకర్ పల్టీ కొట్టింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చే రూట్‌లో ప్రమాదం జరగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సర్వీస్ రోడ్డులో వెహికల్స్?ను పోలీసులు పంపిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా ఫైర్ సిబ్బంది ఫోమ్ స్ప్రే చేస్తున్నారు. ఈ ఘటనలో రెండు కార్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కారులో ఉన్నవారికి గాయాలయ్యాయి. ట్యాంకర్ నుంచి పెట్రోల్ లీక్ అవుతుండటంతో స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. డ్రైవర్ పెట్రోల్ ట్యాంకర్‌లో ఇరుక్కుపోయాడు. జాతీయ రహదారి 65పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

## 5, 6, 7 తేదీల్లో హైటెక్స్ లో చేనేత వస్త్ర ప్రదర్శన

**హైదరాబాద్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన పోచంపల్లి 'ఇక్కత్' వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఈనెల 5,6,7 తేదీల్లో ప్రత్యేక వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. పోచంపల్లి చేనేత కళాకారుల జీవన ప్రమాణాల మెరుగుపరిచే లక్ష్యంతో జూన్ 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్ హైటెక్స్ లో 'త్రెడ్ పోచంపల్లి' పేరిట వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచేందుకు ఏర్పాటు చేసే ఈ ఎగ్జిబిషన్ లో దాదాపు 100 పైగా స్టాల్స్, మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.

## సూడాన్ ప్రయాణికుడికి ఎబోలా లక్షణాలు

### అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలింపు

**హైదరాబాద్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడి ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. గురువారం సూడాన్ నుంచి నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న మహ్మద్ అనే ప్రయాణికుడికి.. ఎయిర్‌పోర్టులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. ఎబోలో వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించిన వైద్య సిబ్బంది వెంటనే అప్రమత్తయ్యారు. వెంటనే అతన్ని గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ సెంటర్‌కు తరలించారు. శాంపిల్స్ సేకరించి సీసీఎంబీకి పంపించినట్టు గాంధీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

కొమురం భీమ్
5 జూన్ 2026 (శుక్రవారం)

## సంపాదకీయం

# తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయం !

తెలంగాణను ముంచిన వారంతా ఇప్పుడు వీరతాళ్లు వేసుకుని..నా తెలంగాణ అంటూ ఊరేగుతున్నారు. విగ్రహాల పేరుతో కొందరు నిగ్రహం కోల్పోయి మాట్లాడుతున్నారు. తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడ్డదని వాపోతున్నారు. ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ కోసం మళ్లీ రాజకీయ రగడ మొదలయ్యింది. ఎవరికి వారు తామే తెలంగాణ భావి విధాతలమని మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను బూచిగా చూపి ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. నిజానికి తెలంగాణ ఏర్పడ్డ తరవాత జరిగిన ద్రోహం, అంతకుముందు ఎప్పుడూ జరగలేదు. ఉమ్మడి ఎపిలో జరగనంత దోపిడీ గత 12 ఏళ్లుగా సాగుతోంది. ఎక్కడిక్కడ భూములు దోచుకున్నారు. అప్పుల చేసి దోచుకున్నారు. తెలంగాణను అప్పనుల కుప్పచేసి అనుభవిస్తున్నారు. ఎవరికి వారు తామే తెలంగాణను ఉద్దరించామని చెప్పుకుంటున్నారు. నిరుద్యోగ సమస్య తీరలేదు. నీటి సమస్యలు తీరలేదు. నిధులు పారించలేదు. అంతెందుకు రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరలకు కొని సేకరణ సక్రమంగా చేయడంలో కూడా విఫలం అయ్యారు. మక్క, జొన్న, మిర్చి, పత్తి రైతులు ఏటా పడుతున్న కష్టాలను పట్టించుకోని అసమర్థులుగా మిగిలి పోయారు. ఇకపోతే తెలంగాణలో కొత్తగా ఆస్తులు సృష్టించలేదు. అయినా పాలకులుగా పనిచేసిన వారు తామే తెలంగాణను ఉద్దరించామని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రజలకు పెన్షన్లు, ఇళ్లు, ఆరోగ్యశ్రీలు ఎరగా వేసి దర్జాగా దోచేస్తున్నారు. నిజానికి ఉమ్మడి ఎపి నుంచి తెలంగాణ విడివడ్డాక తెలంగాణ అభివృద్ధి చెందిందా..లేక అప్పుల పాలయ్యిందా అంటే..అప్పుల పాలయ్యిందని లెక్కలు చెబుతున్నాయి. సమయానికి జీతాలు ఇవ్వలేని వారు పాలకులు అయ్యారు. హైదరాబాద్ మీ అయ్య జాగీరా అని జనసేనాని పవన్ కళ్యాణ్ అనగానే కొందరు ఒంటి కాలిపై లేచి..అవును మా అయ్య జాగీరే అంటున్నారు. ఎందుకంటే మూడో వ్యక్తి వస్తే..దోచుకోవడానికి అవకాశం ఉండదు కనుక...ఎగిరెగిరి పడుతున్నారు. తెలంగాణ సమాజాన్ని బెదిరిస్తున్నావంటూ పవన్‌ను చీల్చి చెండాడేంత పని చేశారు. పవన్ మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు నిజంగానే తెలంగాణలోని కొందరికి బాధ కలిగించాయి. అందులో అనుమానం లేదు. రాజకీయంగా తెలంగాణలో ఉన్న కొందరు జనసేనలోనూ ఉన్నారు. వారికి పదవులు రావాలంటే జనసేన పక్షాన పోటీ చేయాల్సిందే. రాజకీయ పార్టీ అన్న తరవాత పోటీకి సై అంటుంది. జనసేన కూడా అదే చేసింది. అయితే మిగతా ప్రాంతాలకు, తెలంగాణకు ఓ రేఖ అడ్డంగా ఉంది. అదే సెంటిమెంట్. తెలంగాణ ప్రజలను ముంచిందే సెంటిమెంట్. ఆ సెంటిమెంట్‌తోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డది. అది అడ్డం పెట్టుకునే కెసిఆర్ కుటుంబం పదేళ్లు దర్జాగా తెలంగాణలో పాగా వేసి, ఇష్టారాజ్యంగా దోచుకున్నది. పదవులు, డబ్బులు, భూములు దోచేసారు. లక్షల కోట్లు తెలంగాణ నెత్తిన అప్పులు పెట్టారు. తరవాత గత రెండేళ్లుగా కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది. అభివృద్ధి పేరిట ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు పప్పు బెల్లాల్లా తెలంగాణను పంచుకుంటున్నారు. భూములు యధేచ్ఛగా అమ్మేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ రాకతో మరోమారు సెటిమెంట్ రగిల్చి బాగుపడాలన్న ధోరణిలో పొన్నం ప్రభాకర్, కెటిఆర్, కవితలు తామే అసలుసిసలు తెలంగాణ వారుసులమని చెప్పుకునే ప్రయత్నంలో పడ్డారు. తెలంగాణ సమాజం అస్తిత్వ సంక్షోభంల పడుతున్నదనీ గొంతు చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఆంధ్రా ఆధిపత్యం కిందకు వెళుతోందని ప్రకటించుకున్నారు. పవన్ కళ్యాణ్ ఎంట్రీ వెనక బిజెపి, మోడీ ఉన్నారని ఆరోపిస్తున్నారు. తెలంగాణ కూడా భారతదేశంలోనే ఉందని, అందుకు బిజెపి ఎక్కడైనా పావులు కదుపుతుందని తెలుసుకోవాలి. బిజెపికి తెలంగాణ కూడా ఒక రాష్ట్రమని తెలుసు. ఇక్కడ పాగా వేయాలని ఎప్పటనుంచో కలలు కంటోంది. కనుక దాని ప్రయత్నాల్లో అది ఉంది. ఇది రాజకీయం. కెసిఆర్ కూడా భారత రాష్ట్ర సమితి అంటూ దేశాన్ని ఏలుతానని అన్ని రాష్ట్రాలు తిరిగారు. దానిని ఎవరైనా తప్పుపట్టారా అన్నది కెటిఆర్ చెప్పాలి. రాజకీయ పార్టీ పెట్టి ఇక్కడ వైఎస్ షర్మిల కూడా పాదయాత్ర చేశారు. తాను తెలంగాణ బిడ్డనని ప్రకటించుకున్నారు. అప్పుడు లేని రోషం ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నది ప్రశ్న. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వరాష్ట్రంలో ఆంధ్రా వలసవాదం పెరిగింది. దానికి కెసిఆర్ ఆద్యులు. ఆయనే మాకు ఆంధ్రాతో పేచీ లేదంటూ..జగన్‌ను పిలిచి భోజనం పెట్టి అలయ్ భలయ్ చేసుకున్నారు. కృష్ణా నీటిని ఎపికి దోచి పెట్టారని వస్తున్న ఆరోపణలకు కెసిఆర్ బృందం నుంచి సమాధానం లేదు. తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకుని, హైదరాబాద్ సంపదను కొల్లగొట్టడానికి వస్తున్నారని జనసేనాని పవన్ కళ్యాణ్‌ను విమర్శించే ముందు..ఇక్కడ ఎంత కొల్లగొట్టారో చెప్పాలి. ధరణి పేరుతో మోసాలు. కాళేశ్వరం పేరుతో దగా. టెలిఫోన్ ట్యాపింగ్. అస్మదీయులకు రాజ్యసభ పదవులు.. ఇలా చెప్పకుంటూ పోతే కథలు కోకొల్లలు. ఇప్పుడు రెండేళ్ల పాలనలో మంత్రులందరిపైనా అవినీతి గుప్పు మంటోంది. అయినా ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. తెలంగాణ మేధావులు నోరు మెదపడం లేదు. కాంగ్రెస్ వచ్చాకనే స్వేచ్ఛ వచ్చిందని కోదండరామ్ సార్ అంటున్నారు. అంటే కెసిఆర్ ఉన్నంతకాలం నిరంకుశ పాలనలో మగ్గామనే అర్థం కదా. తెలంగాణ అస్తిత్వం మీద దాడిలో, మోదీ, చంద్రబాబుల ఉమ్మడి ప్రణాళిక దాగి ఉందని ఘోషిస్తున్న వారు, ఏ రకమైన దాడి జరిగిందో చెప్పాలి. ఈ గడ్డపై నివస్తిస్తూ ఇక్కడే మమేకమైన వారంతా తెలంగాణ బిడ్డలే. వాళ్ల పిల్లల భవిష్యత్తు, వారి ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ ఈ తెలంగాణ రాష్ట్రంతోనే ముడిపడి ఉన్నాయి. రాజకీయ పార్టీలు అన్ని చోట్లా తమ అస్తిత్వం కోసం ప్రయత్నం చేస్తుంటాయి. కెసిఆర్ కుటుంబానికి చెందిన పార్టీలే తెలంగాణకు ప్రతినిధులు కాదు. తెలంగాణ కోసం కష్టపడే వారు ఎవరైనా రాజకీయలు చేసుకునే హక్కు ఉంటుంది. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనిని తప్పుపట్టడానికి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారం చలాయించిన సమైక్య పాలకులు, తెలంగాణ ఏర్పాటుతో అధికారం చేపట్టిన వారు కూడా తెలంగాణను నిలువునా దోచుకున్నారు. కాబట్టి ఎవ్వరు కూడా తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడలేదు. తమ స్వార్థ రాజకీయం కోసమే పోరాడారు. ఇంకా పోరాడుతున్నారు. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఇదే సెంటిమెంటుతో తమ ఉనికి కోసం కొందరు ఇప్పుడు నానా యాగీ చేస్తున్నారని గుర్తిస్తే మంచిది.

# పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

- మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి
- ఇంకా సెంటిమెంట్ రాజకీయాలతో మోసం చేస్తే ఊరుకోరు
- బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు



**హైదరాబాద్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఆయన మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుందని రాంచందర్ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంని ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ఆనాడు పార్లమెంటులో తమ పార్టీ మద్దతు ప్రకటించిందని అన్నారు. సుష్మా స్వరాజ్ బేషరతుగా మద్దతు ఇస్తేనే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రాంచందర్ రావు అభివర్ణించారు. మున్ముందు బిజెపి తెలంగాణలో కీలకంగా మారుతుందన్నారు.

## విశాఖ వేదికగా జూలైలో ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మహాసభలు

- పోస్టర్ ఆవిష్కరించిన విద్యార్థి నాయకులు



**విశాఖపట్టణం, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ సమావేశాలు జూలై 13,14,15 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, అధ్యక్షులు రామ్మోహన్ తెలిపారు. గురువారం జగదాంబ సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ సమావేశాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సమావేశాలకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు. కేంద్రంలోని ఎన్డీఎ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్ష నిర్వహణలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో, పరీక్షను రద్దు చేశారని, దీంతో ఈ పరీక్షకు హాజరైన 23 లక్షల మంది అభ్యర్థులు తీవ్రమైన ఆత్మ క్షోభకు గురయ్యారని చెప్పారు. అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. కేవలం నీట్ పరీక్షలు మాత్రమే కాకుండా యుజిసి పరీక్షలు, ఆఖరికి సిబిఎస్ఎస్సి పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి ఉందన్నారు. సిబిఎస్సి పరీక్ష నిర్వహణలో విఫలం చెందిన సి బి ఎస్ సి కార్యదర్శిని తొలగించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని ఎస్‌ఎఫ్‌ఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలకు అవసరమైన పాఠ్య పుస్తకాలను కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం ప్రకారం రూపొందించి పంపిస్తుందని చెప్పారు. వాటి పుస్తకాలలో మతాన్ని బోధించే విధంగా వీటి రూపకల్పన ఉందన్నారు. విద్యను కేంద్రీకరించడం సరికాదన్నారు. విద్య వికేంద్రీకరణ జరగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, అలాగే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వేసవి రోజులలో కూడా రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠశాలలను నిర్వహించాయని, వాటిపై ఎటువంటి చర్య లేదన్నారు. ఎస్ ఎస్ సి లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నతంగా రాణించారని గొప్పలు చెప్పిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అడ్డగోలుగా ప్రైవేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించడంతో, ఈ ఏడాది లక్ష మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు దూరమైనట్టు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీలలో అధ్యాపకుల పోస్టులు 5 వేలు ఖాళీలు ఉన్నాయన్నారు. గీతం వంటి ప్రైవేటు విద్యాసంస్థను అధికార పార్టీ వారే నడుపుతూ, ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకురావాలని కోరుతూ, విద్యను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ఎస్‌ఎఫ్‌ఐ పోరాటం చేస్తుందన్నారు. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు పి.సాయి తేజ, ప్రధాన కార్యదర్శి జి. అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్యం అవసరాలకు పెట్టుబడి

- గూగుల్ తీరును అభినందించన ఉదయ్ కోటక్

**ముంబై, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ తాజాగా భారతీయ వ్యాపార సంస్థలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దిగ్గజ కార్పొరేట్ సంస్థలు వేల కోట్లను ఆర్జిస్తున్నప్పటికీ సంతృప్తి చెందకుండా భవిష్యత్తుపై పెట్టుబడులు పెడుతున్న వైనాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా గూగుల్ గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ సంస్థ ఆర్థిక సామర్థ్యం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందని అన్నారు. 'గూగుల్ వార్షిక లాభం 160 బిలియన్ డాలర్లు. గత త్రైమాసికంలో 62 బిలియన్‌లను ఆర్జించింది. సంస్థ మార్కెట్ విలువ 4.5 ట్రిలియన్‌లు. భారతీయ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్, లాభాల కంటే ఇది ఎక్కువ. ఇది భారతీయ కంపెనీలకు మేలు కొలుపు కావాలి. ప్రస్తుత పరిస్థితి ఎంత మెరుగ్గా ఉన్నప్పటికీ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టాలి' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ పోస్టు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. కృత్రిమ మేధపై పెట్టుబడుల కోసం ఇటీవల గూగుల్ ఏకంగా 80 బిలియన్ డాలర్లను సేకరించేందుకు ప్రణాళిక ఆవిష్కరించింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించింది. ప్రభుత్వాలు నిధుల సేకరణ జరిపే స్థాయిలో ఒక కార్పొరేట్ కంపెనీ దీర్ఘకాలిక వ్యూహంతో నిధులు సేకరించడంతో పెద్ద చర్చుకు దారి తీసింది.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం

- నేడు విశాఖలో టిడిపి సైకిల్ రైడ్



**అమరావతి, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహత్తర కార్యక్రమానికి టీడీపీ శ్రీకారం చుట్టనుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పేందుకు సైకిల్ యాత్ర చేపట్టనుందని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రేపు బాధ్యతగా సైకిల్ వినియోగించాలని అన్నారు. విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైకిల్ ప్రయాణం చేయనున్నట్లు చెప్పారు. ప్రపంచం నేడు వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం వంటి సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. ప్రజలు కూడా సైకిల్ యాత్రలో భాగస్వాములు కావాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సైకిల్ వినియోగం వల్ల కాలుష్యం తగ్గుతుందని, ఇంధన వినియోగం తగ్గుతుందని, ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పుకొచ్చారు. చిన్న ప్రయత్నాలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయన్నారు. 'నా దేశం నా బాధ్యతలో' భాగంగా ప్రతి ఒక్కరూ ఇంధన వినియోగం తగ్గించాలన్నారు. ఇంధన సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకునే ఈసారి మహానాడును హైబ్రిడ్ విధానంలో నిర్వహించి గ్రాండ్ సక్సెస్ సాధించామని తెలిపారు. ప్రజలందరూ సైకిల్ యాత్రలో భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు 'నేను సైతం' అంటూ ముందుకు రావాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

### జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలు

**అమరావతి, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలను ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ నియమించారు. జనసైనికుల నుంచే భవిష్యత్తు నాయకత్వాన్ని తీర్చిదిద్దే వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని అధినేత చెప్పుకొచ్చారు. 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసే దిశగా కసరత్తు చేస్తున్నామని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. కేడర్ ఆధారిత నాయకత్వ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయి సమాచారాన్ని పరిశీలించి పార్టీ బాధ్యతల కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకుంటామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ఆస్పత్రిలో మృతురాలి మెడలో పుస్తెల తాడు మాయం

**పోలీసులకు ఫిర్యాదు చేసిన బంధువులు**

**యాదాద్రి భువనగిరి, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్):** భువనగిరిలో దారుణం జరిగింది. మృతదేహంపై ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడును దుండగులు మాయం చేశారు. భువనగిరి జిల్లా ఆసుపత్రిలో చనిపోయిన మహిళ మెడ నుంచి మూడు తులాల బంగారు పుస్తెల తాడు మాయమైన ఘటన కలకలం రేపింది. వలిగొండ మండలం వర్కట్ పల్లికి చెందిన సుష్మిత అనే గర్భవతికి దమ్ము ఎక్కువగా వస్తుండటంతో అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆమె భర్త నాగరాజు ఆమెను జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చాడు. తెల్లవారుజామున నాలుగు గంటలకు సుస్మిత చికిత్స పొందుతూ చనిపోయింది. పోస్టుమార్టం సమయంలో సుస్మితపై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకోండని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆమె ఒంటిపై ఉన్న బంగారం గురించి చూడగా.. అప్పటికే ఆమె మెడలోని మూడు తులాల పుస్తెలా తాడు కనిపించలేదు. ఈ ఘటనపై.. ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు పోలీసులకు సుస్మిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రెక్కింగ్‌కు వెళ్లిన యువతి అదృశ్యం

- స్నేహితులను అరెస్ట్ చేసి విచారణ

**డెహ్రాడూన్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయింది. 6 రోజులు గడుస్తున్నా ఆమె ఆచూకీ దొరకలేదు. పోలీసులు ఆమె స్నేహితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని నైనితాల్‌కు చెందిన బబితా పాండే అనే యువతి ఎంబీఏ చేస్తోంది. వారం రోజుల క్రితం ఆమె తన స్నేహితులు హర్మన్‌పాల్ సింగ్, హర్మన్ ప్రీత్ సింగ్‌లతో కలిసి టూర్‌కు వెళ్లింది. మే 25వ తేదీన వారు హర్సిల్, గంగోత్రితో పాటు చుట్టుపక్కల ఉన్న పర్యాటక ప్రదేశాల్లో తిరిగారు. ముగ్గురూ మే 28వ తేదీన రైతాల్ గ్రామానికి వెళ్లారు. ఆ రోజు అక్కడే ఉన్నారు. మరుసటి రోజు రైతాల్ నుంచి దయారా బుగ్యాల్‌కు ట్రెక్కింగ్ మొదలెట్టారు. ఆ రాత్రి గోయ్ బేస్ క్యాంప్‌లో బస చేశారు. అర్ధరాత్రి నుంచి బబిత కనిపించకుండాపోయింది. బబిత స్నేహితులు ఆమె కోసం వెతికారు. ఆమె ఎక్కడా కనిపించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆర్మీ, ఇండో - టిబెటన్ బోర్డర్ పోలీస్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, పోలీస్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు చెందిన 150 మంది ఆమె కోసం వెతుకుతున్నారు.

కొమురం భీమ్
Komurambheem Telugu Daily
జిల్లాల వార్తలు

## తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షం

### కరీంనగర్, జనగామ, ములుగు జిల్లాలో మోస్తరు వానలు

**హైదరాబాద్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**
తెలంగాణలోని పలు జిల్లాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పుర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు హుజూరాబాద్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో గాలి దుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. ములుగు జిల్లా మల్లంపల్లి, వెంకటాపూర్, ములుగు మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. కాలనీలకు కాలనీలు నీట మునిగిన పరిస్థితి ఉంది. సుభాష్ నగర్, ఆదర్శనగర్ కాలనీలు జలమయం కావడంతో ఇళ్లలోకి వరద నీరు చేరింది. స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ సహాయక చర్యలు చేపట్టారు. ప్రొ÷-లకెయినర్ల సహాయంతో డ్రైనేజీలు క్లీన్ చేయించి వరద నీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. కరీంనగర్ నగరంలో కురిసిన భారీ వర్షానికి కట్టరాంపూర్ నాగన్న చౌరస్తా దగ్గర ఓ ఇంటి ప్రహరీ కూలింది. గోడతో పాటు పక్కనే ఉన్న భారీ వృక్షం కూడా నేలకొరిగింది. అటుగా నిలిపి ఉన్న కారుపై శిథిలాలు పడటంతో కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. భారీ ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు పడుతున్న క్రమంలో.. పాత గోడలు, భారీ వృక్షాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షానికి పక్కనే ఉన్న డ్రైనేజీ పొంగి కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రాంగణం అంతా జలమయమైంది. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో పిడుగు పడింది. మొబైల్?తో వర్షాన్ని రికార్డ్ చేస్తుండగా స్థానికుడు పిడుగుపాటుతో ఉలిక్కిపడ్డాడు.

## ఢిల్లీ అగ్ని ప్రమాద ఘటన

### హోటల్ యజమాని అరెస్ట్

**న్యూఢిల్లీ, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**
ఢిల్లీలోని మాల్వీయ నగర్‌లోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో 21 మంది మృతిచెందిన ఘటనలో ఆ హోటల్ ఓనర్ లవ్‌కేశ్ బజాజ్‌ను నాలుగు రోజుల పోలీసు కస్టడీకి పంపిస్తూ ఢిల్లీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జుడిషియల్ మెజిస్ట్రేట్ భాను ప్రతాప్ సింగ్ ఈ ఆదేశాలు ఇచ్చారు. దర్యాప్తు కోసం కస్టడీలోకి తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు అభ్యర్థించారు. అగ్నిప్రమాదం వేళ నిర్లక్ష్యం కింద కేసు బుక్ చేశారు. ఫ్లోరిష్ స్టే బీ అండ్ బీలో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారిలో ఎక్కువ శాతం మంది విదేశీయులు ఉన్నారు. సమీప ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి బంధువులే ఆ మృతుల్లో ఉన్నారు. అయితే ఏ కారణం చేత మంటలు వ్యాపించాయో ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఎ÷-లోరిష్ స్టే హోటల్ కోసం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కింద హోటల్ ఓనర్ బజాజ్ లైసెన్సు తీసుకున్నారు. కానీ ఆ లైసెన్సు ప్రకారం అతిథులకు కేవలం ఆరు రూమ్‌లు మాత్రమే ఉంటాయి. కానీ ప్రాథమిక విచారణ ప్రకారం.. ఎ÷-లోరిష్ స్టేలో 25 రూమ్‌లు ఆపరేటింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. బేస్మెంట్‌లో ఉన్న అకామిడేషన్‌ను కూడా వాడుతున్నారు. ఆ ప్రాపర్టీకి మొత్తం ఓనర్ బజాజ్ ఒక్కడే. జై మిశ్రా అనే వ్యక్తికి మేనేజ్మెంట్ అప్పగించినట్లు ఆయన చెప్పారు. అయితే మిశ్రా కోసం ప్రస్తుతం పోలీసులు గాలిస్తున్నారు. అతను పరారీలో ఉన్నాడు. బీ అండ్ బీ స్కీమ్‌ను 2007లో ప్రవేశపెట్టారు. ఆ స్కీమ్‌లో సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన వసతిని ఇవ్వనున్నారు. బుధవారం జరిగిన ప్రమాదంలో 21 మంది మృతిచెందగా, దాంట్లో 12 మంది విదేశీయులు ఉన్నారు.

## మమత పార్టీకి మరో షాక్

### బిధ్నానగర్ మేయర్ కృష్ణాచక్రవర్తి రాజీనామా

**కోల్‌కతా, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**
పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. బిధాన్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కృష్ణా చక్రవర్తి.. గురువారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారామె. రాజీనామా అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. 16 ఏళ్లుగా నేనీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ఎవరి పట్లా నాకే అసంతృప్తి లేదు. నిబంధనల ప్రకారమే రాజీనామా చేశా. నాకు నేను కొంత సమయం కేటాయించాలి అనుకుంటున్నాను. కౌన్సిలర్‌గా కొనసాగుతూ ప్రజలకు సేవ చేయదలచుకున్నాను' అని చెప్పారు. టీఎంసీ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీకి సన్నిహితురాలిగా ఉన్న కృష్ణా చక్రవర్తి తన రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. స్థానిక కార్పొరేషన్ అధికారులూ ఆమె రాజీనామా లేఖ అందిన విషయాన్ని ధ్రువీకరించారు. అలాగే రాష్ట్ర పురపాలక వ్యవహారాల శాఖ మంత్రి, అదనపు ప్రధాన కార్యదర్శికి కూడా లేఖ ప్రతులను పంపినట్లు అధికారులు తెలిపారు. ఆమె రాజీనామా ఆమోద పక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతుందని స్పష్టం చేశారు. కాగా.. తృణమూల్ కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కృష్ణా చక్రవర్తి నిర్ణయం బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. టీఎంసీకి సుదీర్ఘకాలంగా సేవలందించిన నేతగా, మమతకు అత్యంత సన్నిహితురాలిగా ఆమెకు పేరుండటంతో ఈ రాజీనామా ప్రాధాన్యం సంతరించుకుంది.




## రెండోరోజూ అమరావతిలో నారాయణ పర్యటన

- వాగుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- వర్షాకాలం నీటి జాగ్రత్తలపై మంత్రి సూచనలు



**అమరావతి, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**
వర్షాకాలం దృష్ట్యా రాజధాని అమరావతిలో వాగుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. వాగుల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. పురపాలక శాఖ మంత్రి పి నారాయణ రెండోరోజు గురువారం రాజధాని అమరావతిలో పర్యటించారు. కొండవీటి వాగు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎన్-9,8,7రోడ్లలో కొండవీటి వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జిల పనుల పురోగతిపై ఆరా తీశారు. బ్రిడ్జిల కింద కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం లేకుండా మట్టి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కొండవీటి వాగు వెడల్పు తక్కువగా ఉన్నచోట మరింత వెడల్పు చేయాలని సూచించారు. నీరుకొండలో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను కూడా మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజధానిలో ట్రంక్ రోడ్లు, బ్రిడ్జిలు, వాగుల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి చెప్పారు. ట్రంక్ రోడ్లపై 43,ఎల్ పి ఎస్ (ల్యాండ్ పూలింగ్)జోన్లలో 32 బ్రిడ్జిలను నిర్మిస్తున్నామని మంత్రి చెప్పారు. వర్షాకాలంలో కొండవీటివాగు ప్రవాహానికి ఇబ్బంది లేకుండా మట్టి తొలగింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. శాఖమూరు, పెనుమాక, నీరుకొండ రిజర్వాయర్లలో సగం పని పూర్తయిందని చెప్పారు. కొండవీటివాగు 23.7 కిలోమీటర్లు, పాలవాగు 16.7 కిలోమీటర్లు, గ్రేవిటీ కాలువ 7.84 కిలోమీటర్లు అభివృద్ధి చేస్తున్నామని మంత్రి చెప్పారు. నీరుకొండ రిజర్వాయర్ 440 ఎకరాలలో నిర్మాణం జరుగుతోందని అన్నారు. వైసిపి నాయకులు రైతుల ను రెచ్చగొడుతున్నారని, విభేదాలు సృష్టించి రాజధానిని విధ్వంసం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. అమరావతిపై వైసిపి కమిటీలు వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతుల భూములను వెనక్కి ఇచ్చేస్తామని వైసిపి నాయకులు చెబుతున్నారని, భవనాలు, రోడ్లు, పైపు లైన్లు ల నిర్మాణం పూర్తయ్యాక సిఎంగా పనిచేసిన వ్యక్తి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. రాజధాని పర్యటనలో మంత్రి వెంట అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) ఛైర్ పర్సన్ డి లక్ష్మి పార్థసారధి, సి ఆర్ డి ఎ,ఎడిసి చీఫ్ ఇంజినీర్లు ఇతర అధికారులు ఉన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు సైకిల్ వినియోగం

- ప్రజలకు చంద్రబాబు విజ్ఞప్తి



**అమరావతి, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**
జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు సైకిల్ వినియోగించాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగే ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఆ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు సైకిల్‌పై వెళ్లనున్నారు. పర్యావరణ హితమైన సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రజలు, పార్టీ నేతలతోపాటు ప్రభుత్వంలో పని చేసే వారంతా శుక్రవారం సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం. ఈ సందర్భంగా గురువారం ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఆయన ఏమన్నారంటే.. 'రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దాం. భూమి మన ఇల్లు? ప్రకృతి మన జీవనాధారం. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత. సహజ వనరులను కాపాడుకుంటూ, గాలి, నీరు, నేలను కలుషితం కాకుండా అందరూ కృషి చేద్దాం. పచ్చదనం పెంపు, ఇంధన వనరులు పొదుపుగా వినియోగించడం అవసరం. అందులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న సైకిళ్లు, ఈ-సైకిళ్లపై ప్రయాణిద్దాం. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుదాం. రేపటి నా విశాఖ పర్యటనలో నేను సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను. అంతా సహకరించాలని, మంచి కార్యక్రమానికి కలిసి రావాలని కోరుతున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## దేశానికి యువతే ప్రాణం

- యువతను తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటా
- ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ వెల్లడి



**అమరావతి, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**
తన రాజకీయ ప్రయాణంలో యువత పాత్రను ప్రత్యేకంగా స్మరించుకుంటూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 2008లో ప్రజారాజ్యం పార్టీ(పీఆర్‌పీ) యువజన విభాగం 'యువరాజ్యం' కోసం పటిష్ఠమైన యువజన విభాగం నిర్మించాలని ప్రణాళిక చేశానని తెలిపారు. జనసేన పార్టీని స్థాపించి 12 ఏళ్లలో ఎన్నో కష్టాలు, పోరాటాలను అధిగమించిన తర్వాత.. పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అనుభవం, పరిణితితో నిండి, సంస్థాగత బాధ్యతలు చేపట్టడానికి, రాజకీయాలు నిర్వహించడానికి, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యువరాజ్యం యువజన విభాగానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 2005 నుంచి ఇప్పటి వరకు తనను విశ్వసించి అండగా నిలిచిన యువతకు పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత, దేశభక్తి కలిగిన యువతను, చైతన్యవంతమైన నాయకులను తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తానని పవన్ ప్రతిజ్ఞ చేశారు. నూతన భారత్.. జెన్‌జెడ్ తరం నుంచి అద్భుతమైన నాయకుల ఆవిర్భావానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. జెన్‌జెడ్ తరం.. బుజ్జగింపు రాజకీయాలు, వంశపారంపర్య రాజకీయాలు, కుల రాజకీయాలు, విభజన రాజకీయాలు, ప్రాంతీయ రాజకీయాలతో విసిగిపోయిందని అభిప్రాయపడ్డారు. ఈ తరం.. జవాబుదారీతనం గల రాజకీయాలను తీసుకురాగల నాయకుల కోసం ఎదురుచూస్తోందని చెప్పారు. అంతేగానీ, ప్రపంచ వేదికలపై భారత్‌ను బలహీనపరిచే నాయకుల కోసం కాదన్నారు. బలమైన, పటిష్ఠమైన భారత్‌ను నిర్మించగల నాయకుల కోసం జెన్‌జెడ్ యువత ఎదురుచూస్తోందని ఎక్స్ ఖాతాలో పవన్ కళ్యాణ్ పోస్ట్ చేశారు.

## టూ వీలర్ స్కిడ్.. దూసుకెళ్లిన బస్సు

### ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం

**హైదరాబాద్, జూన్ 4(కొమురం భీమ్ న్యూస్) :**
నగరంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఇదే ఓ విద్యార్థి ప్రాణాలు పోవడానికి కారణమైంది. సికింద్రాబాద్ పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలో కురిసిన వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఈ క్రమంలో బైకుపై వస్తున్న ఓ యువకుడు స్కిడ్ అయి.. అదే సమయంలో పక్కనే వెళ్తున్న ఆర్టీసీ బస్సు కిందికి దూసుకుపోయాడు. బస్సు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మార్కెట్ స్టేషన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు గురునానక్ కాలేజీలో బీటెక్ చదువుతున్న మదన్ మోహన్‌గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మదన్ మోహన్ అకాల మరణంతో అతని కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## ఎపిలో పలు జిల్లాల్లో వర్షాలు

### నేడు కూడా వర్షాలు కురిసే అవకాశం

**విశాఖపట్నం, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్):**
ఏపీలో గురువారం పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. సాయంత్రం ఐదు గంటల సమయానికి పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంటలో 30.5 మి.మీ., గుంటూరు జిల్లా తాడేపల్లిలో 27.2 మి.మీ., అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 18.5మి.మీ., విజయనగరం జిల్లా గుర్లలో 14.5 మి.మీ. వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దక్షిణ తెలంగాణ, దానిని ఆనుకొని ఉన్న కోస్తాంధ్ర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో శుక్రవారం పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, తదితర జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 44.7 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో 43.8, బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 43.7, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 43.6, కృష్ణా జిల్లా కంకిపాడులో 43.4, ప్రకాశం జిల్లా కొండపిలో 43, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో, నెల్లూరు జిల్లా గూడూరులో 44 డిగ్రీలు, కృష్ణా జిల్లా పెదపారుపూడి, పల్నాడు జిల్లా అమరావతిలో 43.4, కంచికచర్లలో 43.2, గుంటూరు జిల్లా రాయపూడిలో 43, ప్రకాశం జిల్లా చీమకుర్తిలో 42.7, తిరుపతి జిల్లా బోనుపల్లెలో 42.4, విజయనగరం జిల్లా రాజాంలో 42.3, ఏలూరు జిల్లా కలపర్రులో 42.3, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం, ఏలూరు జిల్లా అల్లిపల్లి, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం, విజయనగరం జిల్లా దత్తిరాజేరులో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి' అని వెల్లడించింది.

## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

- మానవ అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు
- సుప్రీంకోర్టు పలు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**
పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను పరిశీలించింది. మానవ అక్రమ రవాణాను నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్‌ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్‌టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

## ట్రెక్కింగ్‌కు వెళ్లిన యువతి అదృశ్యం

### స్నేహితులను అరెస్ట్ చేసి విచారణ

**డెహ్రాడూన్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :**
స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయింది. 6 రోజులు గడుస్తున్నా ఆమె ఆచూకీ దొరకలేదు. పోలీసులు ఆమె స్నేహితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని నైనితాల్‌కు చెందిన బబితా పాండే అనే యువతి ఎంబీఏ చేస్తోంది. వారం రోజుల క్రితం ఆమె తన స్నేహితులు హర్మన్‌పాల్ సింగ్, హర్మన్ ప్రీత్ సింగ్‌లతో కలిసి టూర్‌కు వెళ్లింది. మే 25వ తేదీన వారు హర్సిల్, గంగోత్రితో పాటు చుట్టుపక్కల ఉన్న పర్యాటక ప్రదేశాల్లో తిరిగారు. ముగ్గురూ మే 28వ తేదీన రైతాల్ గ్రామానికి వెళ్లారు. ఆ రోజు అక్కడే ఉన్నారు. మరుసటి రోజు రైతాల్ నుంచి దయారా బుగ్యాల్‌కు ట్రెక్కింగ్ మొదలెట్టారు.








## సీసీసీ నస్పూర్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు

**మంచిర్యాల్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్):** రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నిర్మూలన, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గురువారం సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని నస్పూర్ ప్రాంతంలో పలు దుకాణాలు,పాన్ షాపులు,టీ స్టాల్స్, యువత ఎక్కువగా గుమికూడే ప్రదేశాలు, ధూమపానం చేసే ప్రాంతాలు మరియు ఇతర అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మాదక ద్రవ్యాల రవాణా,విక్రయం, నిల్వ,వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రశాంత్ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటమే లక్ష్యంగా నిరంతరం తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల రవాణా,విక్రయం, నిల్వ లేదా వినియోగానికి పాల్పడే వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని,ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది,నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు అండగా ప్రభుత్వ ఆసుపత్రి



**పెద్దపల్లి, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** పెద్దపల్లి జిల్లా కల్వచర్ల గ్రామానికి చెందిన 21 సంవత్సరాల యువకుడు తీవ్రమైన కడుపునొప్పితో గురువారం జిల్లా ఆసుపత్రి, పెద్దపల్లికి వచ్చాడు. వైద్యులు పరీక్షలు నిర్వహించగా మూత్రనాళంలో రాళ్లు ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం నిపుణులైన వైద్యుల బృందం విజయవంతంగా డీజే స్టెంట్ అమర్చడం జరిగింది. అలాగే, కొలనూరు గ్రామానికి చెందిన 28 సంవత్సరాల మహిళకు రెండు నెలల క్రితం మూత్రనాళ సమస్య కారణంగా మన ఆసుపత్రి లో డీజే స్టెంట్ అమర్చగా, ఈరోజు ఆమెకు డీజే స్టెంట్‌ను విజయవంతంగా తొలగించడం జరిగింది. ఈ రెండు శస్త్రచికిత్సల లో డాక్టర్ సంతోష్ రెడ్డి(యూరాలజిస్ట్), డాక్టర్ రాము (జనరల్ సర్జన్) మరియు డాక్టర్ కృష్ణవేణి (అనెస్తీషియా) పాల్గొన్నారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సలలో పాల్గొన్న వైద్య బృందాన్ని, ఓటీ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్ గారు ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ప్రజలందరూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న నవజాత శిశు కేంద్రం సేవలు, 2 డి ఎకో సేవలు, ఆధునిక పరిజ్ఞానంతో కూడిన లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, యూరాలజీ సేవలు మరియు రూట్ కెనాల్ సేవలను ఉపయోగించుకోవాలని, మరియు ఈ సేవలలో ఏవైనా ఇబ్బందులు ఎదురైనచో నేరుగా సూపరింటెండెంట్ ని కలవచ్చు అని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భం గా ప్రజలందికి సూపరింటెండెంట్ చేయు విజ్ఞప్తి ఏమనగా వారికి సంబందించిన పేషెంట్ హాస్పిటల్ లో ఉన్న సమయం లో సానిటేషన్ గురించి గాని, వాష్ రూమ్ శుభ్రత గురించి గాని ఎవరైనా డబ్బులు అడిగినా గాని మరియు ఏ ఇతర సమస్య ఉన్నా కూడా నర్సింగ్ సూపరింటెండెంట్ ని, =మీని, నేరుగా సూపరింటెండెంట్ గారిని సంప్రదిశీచగలరు లేని యెడల ఫిర్యాదులను కంప్లైంట్ బాక్స్ లో ఇవ్వవచ్చు, వారి సమస్యని వెంటనే పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేస్తాం అని సూపరింటెండెంట్ గారు తెలియచేయడమైనది మరియు ప్రభుత్వ ఆసుపత్రి లో అన్ని రకముల సేవలు ఉచితం ఎవ్వరికి లంచం ఇవ్వరాదు అని తెలియచేసారు.



## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక గ్రామ సభల్లో ప్రజా భద్రతపై అవగాహన కల్పించిన పోలీసులు

**గోదావరిఖని, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** రామగుండం పోలీస్ కమీషనరేట్‌లోని పెద్దపల్లి,మంచిర్యాల జోన్ల పరిధిలోని ప్రతి పోలీస్ స్టేషన్‌కు చెందిన గ్రామాలు, వార్డుల్లో నిర్వహించిన గ్రామ సభల్లో డీసీపీలు,ఏసీపీలు, సీఐలు,ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణ, ప్రజల రక్షణ,భద్రత, చట్టాలపై అవగాహన, సీసీ కెమెరాల ప్రాముఖ్యత,యువత మరియు ప్రజల సామాజిక బాధ్యతలకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పౌరుడి పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ,ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే సురక్షితమైన, నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ గ్రామ సభ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రజలు చేరాలి

- అధికారులు, కార్పోరేటర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- ఇది ప్రజా ప్రభుత్వం.. ప్రజా పాలన
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మేయర్ మహంకాళి స్వామి





**గోదావరిఖని, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** ప్రభుత్వ పథకాల సమాచారం ఎప్పటికపుడు ప్రజలకు చేరవేయాలని రామగుండం శాసన సభ్యులు ఎం ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం 5,6, 7, 8, 9, 35, 36, 37, 38, 47, 48, 49 , 50, 51, 59, 60, డివిజన్ లకు సంబందించి క్లస్టర్ స్థాయి వార్డు సభను నగర మేయర్ మహంకాళి స్వామి అధ్యక్షతన సి ఎస్ పి కాలనీ లోని ఆర్ సి ఓ ఎ క్లబ్ లో నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రామగుండం నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో మార్పు ప్రస్ఫుటంగా గోచరిస్తున్న విషయం గమనించాలని అన్నారు. కొత్త రేషన్ కార్డులు , ఇందిరమ్మ ఇండ్లు , ఉచిత విద్యుత్ ,మహిళలకు ఉచిత ఆర్ టి సి బస్సు తదితర పథకాలతో వేలాది మంది లబ్ది పొందుతున్నారని అన్నారు. వరంగల్ , కరీంనగర్ లాంటి నగరాలతో రామగుండం నగరం పోటీ పడి ఉత్తర తెలంగాణ లో ప్రదాన నగరంగా తెలంగాణ లో హైదరాబాద్ తరువాత ప్రముఖ నగరంగా తీర్చిదిద్దాలని ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. తమ ప్రయత్నంలో ప్రజలు కూడా చేతులు కలిపి పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ స్వచ్ఛ నగరంగా రూపొందించుకుందామని అన్నారు. వర్షా కాలంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ దఫా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని ముందుకు పోతున్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో వరద ప్రభావం పడకుండా కాలువల్లో పూడిక తొలగింపు కార్యక్రమం మూడు నెలల ముందుగానే ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. గత 20 ఏళ్లుగా కాలువల్లో సరిగా పూడిక తొలగించకపోవడంతో ఎక్కడికక్కడే పేరుకుపోయిందని అన్నారు. అదనపు వాహనాలు , సిబ్బంది సహకారంతో పూడిక తొలగిస్తుంటే పరుపులు ,టైర్లు వంటి వస్తువులు బయటకు వస్తున్నాయని అన్నారు. కాలువల్లో చెత్త వేయడం వలన నీళ్ళు సాఫీగా ప్రవహించక ఇళ్ళల్లోకి వస్తాయనే విషయం ప్రజలు గ్రహించాలని కోరారు. తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి మురుగు కాలువలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి సముచిత గౌరవశీ ఇవ్వాలని అన్నారు. అలాగే భూ గర్భ జలాలు పెరగడానికి ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని అన్నారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న తమ ప్రభుత్వానికి అండగా నిలవాలని అన్నారు. అన్ని విభాగాల అధికారులు కూడా సమన్వయంతో పని చేసి ప్రభుత్వం తమకు అండగా ఉందనే భరోసా ఇవ్వాలని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన రామగుండశీ నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ రానున్న వర్షా కాలంలో విపత్తులను నివారించేందుకు అలాగే ఎలాంటి విపత్తు నైనా ఎదుర్కొనేందుకు అన్ని విభాగాల సిబ్బంది సిద్దంగా ఉండాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రారంభానికి ముందే ఎం ఎల్ ఎ ఆదేశాలతో నగర పాలక సంస్థ ఆద్వర్యంలో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ప్రారంభించడం జరిగిందని అన్నారు. కాలువల్లో పూడిక తీత పేర గతంలో మాదిరిగా లక్షల రూపాయలు వృధా చేయకుండా నగర పాలక సంస్థ స్వంత వాహనాలు , సిబ్బందిని ఉపయోగించి సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగుతుందని అన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో వరద ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలపై ముందుగా దృష్టి పెట్టడం జరిగిందని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ లక్ష్యానికి అనుగుణగా గత మూడు నెలలుగా అనేక కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు . భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరో 8 కొత్త వాటర్ ట్యాంకులు , కొత్త పైప్ లైన్ నిర్మించడానికి ఎం ఎల్ ఎ చొరవతో రూ 100 కోట్లు మంజూరయ్యాయని అన్నారు. అలాగే మరో రూ 100 కోట్లతో రోడ్లు , కాలువలు , యు జి డి నిర్మాణ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని అన్నారు. ఎం ఎల్ ఎ గా ఎం ఎస్ రాజ్ ఠాకూర్ ఎన్నికయిన తరువాత రామగుండంలో రూ 1200 కోట్లతో అభివృద్ధి జరుగుతున్నదనే విషయం ప్రజలు గ్రహించాలని అన్నారు. ఎ సి పి ముడుత రమేష్ మాట్లాడుతూ వర్షా కాలంలో శిధిలమైన ఇండ్లు , గోడల ప్రక్కన ఉండకూడదని అన్నారు.. తల్లిదండ్రులు తమ పిల్లలు ఫోన్ లో ఏమి చేస్తున్నారో గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మహిళల భద్రత , ప్రమాదాల నివారణకు పోలీస్ సిబ్బంది కృషి చేస్తున్నారని అన్నారు. రామగుండంలో గంజాయి వినియోగం తగ్గించగలిగామని అన్నారు. పోలీస్ సహాయం అవసరమయినప్పుడు 100 నెంబర్ సంప్రదించాలని అన్నారు. కాగా ఈ సంధర్భంగా ఓటరు జాబితా సర్ కు సంబందించి రామగుండం ఎం ఆర్ ఓ రవీందర్ అవగాహన కల్పించారు. ఓటరు జాబితా 2002 తో ఇప్పటి జాబితా పోల్చి చూసి ధృవీకరించుకోవడం జరుగుతున్నదని అన్నారు. జాబితా నుండి తమ ఓట్లు తొలగిస్తారనే అపోహ పెట్టుకోవద్దని అన్నారు. నగర పాలక సంస్థ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సంపత్ ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ నిబంధనలను పవర్ పాయింట్ ప్రెజెశీటేషన్ ద్వారా వివరించారు. నగర పాలక సంస్థ ఎ సి పి శ్రీహరి “జల సంచయ్ జన బాగీధరి” పథకం గురించి వివరించడంతో పాటు ఇంకుడు గుంత నిర్మించుకునే విధానం పై వీడియో ప్రదర్శిస్తూ వివరించారు. నగర పాలక సంస్థ ఎ ఇ తేజస్విని వర్షాకాలం లో ప్రమాదాల బారిన పడకుండా రోడ్ల గుంతలు పూడ్చడానికి , శిధిలమైన యు జి డి ఛాంబర్ కవర్ లు ఏర్పాటు చేయడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. అలాగే వన మహోత్సవంలో భాగంగా ఈ దఫా 1, 80,000 మొక్కలు నాటుతున్నామని తెలిపారు. జులై 1 నుండి ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని అన్నారు. రామగుండం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి అతుల్య నాయర్ మాట్లాడుతూ వడ దెబ్బ నివారించడంలో భాగంగా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అన్ని అంగన్ వాడీ కేంద్రాలలో అందుబాటులో ఉంచామని అన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా దోమల నివారణా చర్యలు చేపట్టాలని అన్నారు. కాగా ఈ సంధర్భంగా అగ్ని మాపక శాఖ వారు విపత్తుల నివారణకు తీసుకుంటున్న చర్యలు , ఐ సి డి ఎస్ విభాగం ఆద్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పోషకాహారం పంపిణీ తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు , నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , టి పి ఎస్ నవీన్ , ఆర్ ఓ ఆంజనేయులు , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , మెప్మా టి ఎం సి మౌనిక , సిబ్బంది , ఆర్ పి లు , స్వశక్తి మహిళలు , ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణలో అడవుల ప్రాధాన్యాన్ని

## విద్యార్థులు గుర్తించి ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలి

- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అవగాహన కార్యక్రమం, వ్యాసరచన పోటీలు నిర్వహణ
- మంథని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ అవగాహనలి
- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం
- పెద్దపల్లి అటవీ రేంజ్ అధికారి టి. సతీష్ కుమార్



**మంథని, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇంచార్జ్ జిల్లా అటవీ అధికారి ఎం. నవీన్ రెడ్డి, ఐఎఫ్ఎస్ ఆదేశాల మేరకు మంథని రేంజ్ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణలో అడవుల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు పెద్దపల్లి అటవీ రేంజ్ అధికారి టి. సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అడవులు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని, జీవవైవిధ్య పరిరక్షణకు అటవీ సంపద ఎంతో అవసరమని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో, భూగర్భ జలాల సంరక్షణలో, స్వచ్ఛమైన గాలి అందించడంలో అడవుల ప్రాధాన్యతను వివరించారు. “పర్యావరణ పరిరక్షణలో అడవుల ప్రాధాన్యం” అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ప్రకృతి పరిరక్షణ పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి జి. కొమురయ్య, స్ట్రైక్ ఫోర్స్ ఎఫ్ఎస్‌వో ఎస్.డి. రహీమతుల్లా, ఫారెస్ట్ బీట్ అధికారులు డి. శ్రావంతి, ప్రదీప్, సహాయ శాస్త్రవేత్త పి. కనకజ్యోతి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డి. కల్పన, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. రమేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి. శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తర తెలంగాణలోనే ఆదర్శవంతమైన నగరం : ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**గోదావరిఖని, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 57వ డివిజన్‌లో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లో తిరుగుతూ స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రామగుండం ప్రాంత సమగ్ర అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్లపై చెత్త వేయకుండా, డ్రైనేజీల్లో వ్యర్థాలను పడవేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో రామగుండం ప్రాంతాన్ని ఉత్తర తెలంగాణలోనే ఆదర్శవంతమైన, అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## గంజాయి నిర్మూలనకు యువత ముందుకు రావాలి

- సర్వాయిపేటలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం
- యువకులకు వాలీబాల్ కిట్ల పంపిణీ – అగ్నివీర్‌కు ఎంపికైన యువకునికి ఘన సన్మానం
- సీఐ ఆర్. కృష్ణ

**మంచిర్యాల్, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్):** కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ యువకులకు రెండు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ ఆర్. కృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజాన్ని గంజాయి అనే మత్తు పదార్థం తీవ్రంగా ప్రభావితం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువత గంజాయి మత్తుకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. గంజాయి సేవించడం వల్ల ఆరోగ్య సమస్యలు పెరగడమే కాకుండా నేరప్రవర్తన, కుటుంబ విభేదాలు, సామాజిక అస్థిరత కూడా పెరుగుతున్నాయని తెలిపారు. యువత చదువు, ఉద్యోగాలు, క్రీడలు,జీవిత లక్ష్యాల నుంచి దూరం కాకుండా జాగ్రత్తపడాలని సూచించారు. అదేవిధంగా సర్వాయిపేట గ్రామానికి చెందిన ఉప్పరి సాయికుమార్ అగ్నివీర్ సైనిక ఉద్యోగానికి ఎంపిక కావడంతో సీఐ ఆర్. కృష్ణ,ఎస్సై రాజశేఖర్ కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. గ్రామ యువత సాయికుమార్‌ను ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి ఎస్సై రాజశేఖర్,హెడ్ కానిస్టేబుల్ బుజ్జిబాబు,పోలీసు సిబ్బంది, సర్వాయిపేట గ్రామ సర్పంచ్ రాజేష్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కొమురం భీమ్
Komurambheem Telugu Daily




## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు

(మొదటి పేజీ తరువాత)

ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేసి అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. వచ్చాక ఏసీబీ ట్రాప్ ఆయిన అన్ని క్లియర్ చేశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మూడేళ్లు రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసుకొని పని చేస్తానని పేర్కొన్నారు. రజలకు, ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైనా తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్ధలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెలించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రోక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితాలో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

## నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు

(మొదటి పేజీ తరువాత)

ప్రమాదంతో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు, కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు అందుబాటులో కి తేవాలని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో స్పందించిన అధికారులను ఆయన అభినందించారు. ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్, ప్రవీణ్ రెడ్డి, సుమిత్ సింగ్, కట్టా బలరాం, సాయి, ప్రదీప్ గౌడ్, తదితరులు ఉన్నారు.

కొమురం భీమ్ ప్రకటనలు
మీ బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల శుభకార్యక్రమాలకు శుభాకాంక్షలు తెలుపుటకై...
అతి తక్కువ ధరలలో ప్రకటనలను మీకు అందిస్తున్నాము
4 లైన్ల క్లాసిఫైడ్‌కు కేవలం రూ. 50 మాత్రమే
వివరాలకు సంప్రదించండి...
8522024855, 9493580051, 9849639775

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యం

- జిల్లా కలెక్టర్ అంకిత్



**చంద్రుగొండ, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6వ తేదీ నుండి అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయబడుతోందని తెలిపారు. గ్రామ సభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలని అన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు .రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పంటల దిగుబడులు పెరిగేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు.గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు ప్రతి కుటుంబం అలవరుచుకోవాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను జాబితా నుండి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, గ్రామంలోని విద్యుత్ అదనపు లైన్లు , అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి కి ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ విద్యా చందన, ఎంపీడీవో అశోక్, తహసిల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రుగొండ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ

- సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై కీలక ఆదేశాలు
- పోలీస్ స్టేషన్ కు వచ్చిన బాధితుల ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**చంద్రుగొండ, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణ పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని, స్టేషన్ రికార్డులను, క్రైమ్ ఫైల్స్ ను పరిశీలించి పలు సూచనలు చేయడం జరిగింది. సిబ్బందితో ఎస్పీ మాట్లాడుతూ వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అదేవిధంగా అక్రమ ఇసుక రవాణా, త్రవ్వకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్రమ ఇసుక రవాణా పై ఉక్కు పాదం మోపాలని ఆదేశాలు జారీ చేశారు. ?ప్రతి ఒక్క పోలీస్ అధికారి, స్టేషన్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ విధానాలను అలవర్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.ఈ తనిఖీలో భాగంగా, స్టేషన్‌కు వచ్చిన బాధితుల ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి, తక్షణమే వారికి న్యాయం జరిగేలా చూడాలని, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి, సబ్ ఇన్స్పెక్టర్ శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు విద్యుత్ పట్ల జాగ్రత్తలు వహించాలి

- ఖమ్మం జిల్లా ఎస్ ఈ శ్రీనివాసులు



**ఏన్కూరు, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** ప్రజలు విద్యుత్ పట్ల జాగ్రత్త వహించాలని ఖమ్మం జిల్లా ఎస్ ఈ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రమైన ఏన్కూర్ నుండి నాచారం శ్రీ అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు విద్యుత్ స్తంభాలను గురువారం ఆయన పరిశీలించారు. నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకి అడ్డంగా ఉన్న రేపల్లెవాడ వాగు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలను రోడ్డు పనులకు ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలని ఏ ఈ ని ఆదేశించారు. పాత వాటిని తొలగించి కొత్త లైన్ల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నాచారం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి, ట్రాన్స్ఫార్మర్ నిర్మించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కలిగిస్తున్నట్లు ఆయన అన్నారు. వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.విద్యుత్ సరఫరాలో తరచూ ఆటంకం కలగకుండా ప్రీ మాన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎండలు తగ్గగానే ఈ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. దీని ద్వారా ముందుగానే సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ లు రమేష్, రాములు నాయక్, బద్రుపవర్, ఏడీఈ యాసీన్, ఏఈ ఉమాకాంత్, కాంట్రాక్టర్ మొగిలి శ్రీనివాసరెడ్డి, మొగిలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సంస్థలను తాకట్టు పెట్టే యత్నం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతు సంఘం ధ్వజం

**ఖమ్మం, జూన్ 3 (కొమురం భీమ్ న్యూస్) :** విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలను తాకట్టు పెట్టి అప్పుతీసుకోవడానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. కారేపల్లి మండలం ఎర్రబోడులో రైతు సంఘం సమావేశం మండల అధ్యక్షుడు ముండ్ల ఏకాంబరం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బొంతు రాంబాబు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లును తీసుకురావడానికి చేసిన ప్రయత్నాన్ని దేశ వ్యాప్తంగా రైతాంగం గట్టిగా ప్రతిఘటించి తిప్పికొట్టిందన్నారు. ఆ బిల్లును సవరణ పేరుతో తిరిగి రాష్ట్రాలపై రుద్ది పక్రియను మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. దానికి ప్రతిఫలంగా రాష్ట్రానికి రూ.10 వేల కోట్లు ఇవ్వడానికి కేంద్రం సముఖంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎత్తుగడలను రాష్ట్ర ప్రభుత్వం తలోగ్గి నడుచుకుంటుందన్నారు. రాష్ట్రంలో నార్తరన్, సౌతరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ఉండగా రైతుల కోసమంటూ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పేరుతో కొత్తగా మరో డిస్ట్రిబ్యూషన్ సంస్థలను ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. రైతుకు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇవ్వటం కోసమే రైతు పవర్ పంపిణి సంస్థ ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్రం చెప్పుతున్నా దానిలో యదార్థం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న నార్తరన్, సౌతరన్ కంపెనీల నుండి రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పేరుతో రైతుల విద్యుత్ కనెక్షన్లను వేరుచేయటం ద్వారా నార్తరన్, సౌతరన్ కంపెనీలకు లాభాలు చూపి వాటిని తాకట్టుపెట్టి అప్పుతీసుకోవటానికి రాష్ట్రం ఎత్తుగడలేస్తుందన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు రంగం సిద్ధమైందన్నారు. రాష్ట్రానికి ప్రతి స్మార్ట్ మీటర్ ఏర్పాటుకు కేంద్రం రూ.1400 ఇవ్వనుందన్నారు. స్మార్ట్‌మీటర్లు ఇండ్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల వద్ద కూడా ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ప్రైవేటీకరణలో భాగంలోనే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రయత్నిస్తుందన్నారు. రైతులు పండించిన మొక్కజొన్న అమ్మకానికి అష్టకష్టాలు పడ్డారన్నారు. బస్తాలు, లారీలు, గోడౌన్ల కొరత, అకాల వర్షాలతో రైతులు నానాయాతన పడి ప్రభుత్వానికి మొక్కజొన్న అమ్మినారని వాటి పైకాన్ని వెంటనే రైతు ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

## నూతన ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్



**గుండాల జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** నూతన ఎస్ఐ కి శాలువా కప్పి మర్యాద పూర్వకంగా కలిసిన రోళ్లగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ భుక్య మంగమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు భుక్య శ్రీను. గుండాల మండల పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బదిలీపై వచ్చిన సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) శ్రావణ్ కుమార్ ని గురువారం రోళ్లగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ భుక్య మంగమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు భుక్య శ్రీను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని కోరారు. గ్రామ పంచాయతీ తరపున, ప్రజల తరపున పోలీస్ శాఖకు ఎల్లప్పుడూ పూర్తి సహకారం ఉంటుందన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఎక్లాస్ పూర్ గ్రామంలో గ్రామసభ

- మండల ప్రజా పరిషత్ అధికారి గాంభిరావుపేట తిరుపతి

**రామగుండం, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం అంతర్గాం మండలంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ఆదేశాల ఎక్లాస్పూర్ గ్రామంలో ప్రత్యేక గ్రామసభను సర్పంచ్ జూపాక మమత -శ్రీనివాస్ అధ్యక్షతన, మండల ప్రజాపరిషత్ అధికారి గాంభీరావుపేట తిరుపతి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలపై గ్రామ ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జూపాక మమత- శ్రీనివాస్, ఉప సర్పంచ్ లగిశెట్టి రాకేష్, మండల ప్రజా పరిషత్ అధికారి గాంభీరావుపేట తిరుపతి, ఎంపీ ఓ బైరివేణు మాధవ్, రామగుండం వై. కృష్ణ కుమార్, అంతర్గాంబోయ వెంకటస్వామి, విద్యుత్ శాఖ ఎఇ ఆశ శంకర్, మిషన్ భగీరథ, ఇరిగేషన్ ఎ ఇ ఇ, వార్డు సభ్యులు, స్వయం సహాయక సంఘాలసభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉపాధి కూలీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**పాలకుర్తి, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** కొత్తపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని గురువారం సందర్శించిన రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలతో మమేకమై వారి పని పరిస్థితులు, అవసరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంతో పాటు వారి ఆర్థిక స్థితిని మెరుగుపర్చేందుకు దోహదపడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హులైన కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం తీవ్ర ఎండల నేపథ్యంలో ఉపాధి కూలీలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తగినంత నీరు తాగుతూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎండ దెబ్బ తగలకుండా ఉండేందుకు కూలీలకు టోపీలు, గ్లూకోవిటా పంపిణీ చేసి వారి సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మక్కన్ సింగ్ సేవ సమితి చైర్మన్ మనాలి ఠాకూర్ మరియు సర్పంచ్ లు, వార్డ్ మెంబర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సబ్ ఎడిటర్స్ కావలెను
సెల్ : 8522024855

# అవయవ మార్పిడి చట్టానికి ఆమోదం

- వివిధ రాష్ట్రాల్లో ఉన్నట్లుగానే అమలు
- బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం
- భీమిలీ తదితర బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా అమలు
- క్వాంటమ్ వ్యాలీ భూములకు స్టాంపు డ్యూటీ మినహాయింపు
- ఏవియేషన్ పాలసీ-2026కు కేబినెట్ ఆమోదం
- కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు
- ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంపు
- ఎపి కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



**అమరావతి, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్న ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఆ నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ చట్టం అమలుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. 2011 కేంద్ర చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. అవయవ మార్పిడి ప్రక్రియలో పారదర్శకత, వైద్య సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే అమలులో ఉన్న విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం తెలిపింది. భీమిలి, విశాఖపట్నం, శ్రీకాకుళం, చీరాల బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా ఈ పాలసీ అమలు చేయనున్నారు. గోవా, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల అనుభవాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే బీచ్ షాక్స్‌లు తెరిచి ఉంచడానికి అనుమతి ఇవ్వనున్నారు. పరిమిత రకాల మద్యం విక్రయాలకు మాత్రమే అనుమతి ఉండనుంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే తదుపరి విస్తరించే అవకాశం ఉంది. రాజధాని అమరావతి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఏవియేషన్, ఉపాధి, మత్స్యరంగం, పోలవరం, పారిశ్రామిక పార్కులు, పోర్టులు, పర్యాటకం వంటి వివిధ రంగాల్లోని ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి కేటాయించిన భూమి రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపును ఆమోదించింది. రాష్ట్రంలో రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ-2025 ముసాయిదాకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మద్దువలస, యేలేరు రిజర్వాయర్లలో ఫిషిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ పాలసీ-2026కు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే అగ్రిగోల్డ్ తదితర డిపాజిటర్ల కేసుల పరిష్కారం కోసం 21 పోస్టుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చిత్తూరు జిల్లాలో వ్యవసాయ శాఖ భూమిపై సోలార్ విద్యుత్ ఎ÷-లాంట్ ఏర్పాటుకు 30 ఏళ్ల లీజు ఇవ్వడానికి అనుమతి ఇస్తూ కేబినెట్ నిర్ణయిం తీసుకుంది. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ హామీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు టెండర్లకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. రాజధాని అమరావతిలో పలు నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. పోలవరం సహా వివిధ ప్రాజెక్టుల పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు, గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీపీఎస్ అమల్లోకి రాకముందు ఇచ్చిన నోటిఫికేషన్లలో ఎంపికై.. వివిధ కారణాలతో సీపీఎస్ అమలు తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పింఛను వ్యవస్థ అమలు చేయాలనే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీలో సవరణలకు కేబినెట్ ఆమోదించింది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ ను జులై 1 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేసే ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది.



## రష్యాలో కొనసాగిన లోకేశ్ పర్యటన

### బిజినెస్ ఫోరమ్‌లో పెట్టుబడులపై చర్చ

**అమరావతి, జూన్ 4 (కొమురం భీమ్ న్యూస్) :** రష్యాలో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఎస్పీఐఈఎఫ్ బిజినెస్ ఫోరం సదస్సులో ఆంధ్రప్రదేశ్ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. భారత్, రష్యాల మధ్య ఉన్న సుదీర్ఘ సాంకేతిక, ఆర్థిక అనుబంధాన్ని గుర్తుచేస్తూ, 2030 నాటికి 100 బిలియన్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవడంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో ఆంధ్రప్రదేశ్‌ను 2.5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ ధ్యేయమని ప్రకటిస్తూ.. అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను కేవలం పెట్టుబడిదారులుగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో సమాన భాగస్వాములుగా ఆహ్వానించారు. ఈ సదస్సులో భాగంగా రష్యాకు చెందిన ప్రముఖ ఉక్కు దిగ్గజం 'నోవోస్టల్-ఎం సంస్థ చైర్మన్ ఇవాన్ డెమ్చెంకోతో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భారతదేశంలో అత్యాధునిక ఈఏఎఫ్ (ఇంఈ) గ్రీన్ స్టీల్ ఎ÷-లాంట్ నిర్మాణాన్ని చేపట్టాలని, అదేవిధంగా ఏపీలోని ప్రతిష్ఠాత్మక పారిశ్రామిక హబ్ 'శ్రీసిటీ'లో రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లును ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ 'సిస్టమా' ప్రెసిడెంట్ తాగిర్ సిట్దేకోవ్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేష్.. రాష్ట్రంలో సరికొత్త రవాణా, సాంకేతిక ప్రాజెక్టులపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అంతర్గత జలరవాణా మార్గాలలో పర్యావరణ అనుకూల 'ఎలక్ట్రిక్ రివర్ మెట్రో' పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించాలని కోరారు. దీంతో పాటు భవిష్యత్ సాంకేతికతలకు కేంద్రంగా నిలుస్తున్న ఏపీ 'క్వాంటమ్ వ్యాలీ ఫ్రేమ్ వర్క్' ప్రాజెక్టులో సిస్టమా సంస్థను భాగస్వామి కావాల్సిందిగా మంత్రి నారా లోకేష్ ఆహ్వానించారు. లోకేశ్‌తో లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు ఉన్నారు.

## కొమురం భీమ్




## వైభవ్ పై మనసుపారేసుకున్న రిద్ధిమా పాఠక్



ఐపీఎల్ సమరంలో విరోచితమైన ఆట తీరు ప్రదర్శించి వరల్డ్ వైడ్‌గా ఫేమస్ అయిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన నిర్భయమైన బ్యాటింగ్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. వైభవ్ సాధించిన విజయాలు దేశీయంగా, అంతర్జాతీయంగా అన్నిచోట్లా ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇటీవల, 2026 ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న అతి పిన్న వయస్కుడైన ఆటగాడిగా వైభవ్ నిలిచాడు. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ 16 మ్యాచ్‌లలో ఐదు అర్ధశతకాలు, ఒక శతకంతో సహా 776 పరుగులు సాధించాడు. స్పోర్ట్స్ యాంకర్ రిద్ధిమా పాఠక్ వైభవ్ అద్భుత ప్రదర్శనను ప్రశంసిస్తూ, అతడిని బీహార్ అతిపెద్ద బ్రాండ్ అంబాసిడర్ అని అభివర్ణించారు. దీనికి సంబంధిన వీడియోని కూడా ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో వైరల్ అవుతోంది. వైభవ్ సూర్యవంశీ బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లా తాజ్‌పూర్ గ్రామానికి చెందినవాడు. అతను బీహార్ తరఫున దేశీయ క్రికెట్ ఆడతాడు. అయితే ఈసారి ఐపీఎల్‌లో తన విజృంభణ చూపించడంతో పిల్లాడు కాస్తా క్రికెట్ పిడుగు అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. క్రికెట్ లెజెండ్స్, సెలబ్రిటీలు సైతం ఈ కుర్రాడి ఆటతీరు, రికార్డులు బద్దలు కొట్టడంపై స్పందించారు. బీహార్‌కు అంతర్జాతీయంగా కీర్తిని తెచ్చిపెట్టిన వైభవ్ గురించి తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో రిద్ధిమా పాఠక్ ఇంట్రెస్టింగ్ కామెంట్ చేశారు. చిన్నప్పుడు స్కూల్లోనూ, కాలేజీలోనూ 'మీరు ఎక్కడి నుండి వచ్చారు?' అని మమ్మల్ని అడిగినప్పుడు, మేము బీహార్ వాసులమని చెప్పడానికి సంకోచించేవాళ్ళమని కాని ఇప్పుడు గర్వంగా ఉందని చెప్పుకొచ్చింది. ఎందుకంటే లాలూ ప్రసాద్ యాదవ్ బీహార్‌కు అలాంటి ఇమేజ్ ఏదీ ఇవ్వలేదు. కానీ ఆ తర్వాత రెండు అద్భుతమైన విషయాలు జరిగాయి. మొదటిది మహేంద్ర సింగ్ ధోని, రెండవది, 'గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్' సినిమా. ఈ రెండూ బీహారీలలో కొంత ఉత్సాహాన్ని నింపాయి. కానీ దీని వల్ల వచ్చిన మంచి ప్రచారం మొత్తం బీహార్ నుండి విడిపోయి కొత్త రాష్ట్రంగా ఏర్పడిన జార్ఖండ్‌కు చేరిందని పాఠక్ తెలిపారు. అయితే ఇప్పుడు ముందుకు వచ్చిన వ్యక్తి వైభవ్ సూర్యవంశీ. అతను పూర్తిస్థాయి బీహారీ. ఇప్పుడు తాను బీహారీ అని చెప్పుకోవడానికి ఏ బీహారీ కూడా సిగ్గుపడటం లేదని గర్వపడుతున్నామని చెప్పుకొచ్చింది. ఆమె మాటల్లో ఆనందం, ముఖంలో గర్వం చూస్తుంటే వైభవ్ సూర్యవంశీని విపరీతంగా అభిమానిస్తున్నట్లుగా కనిపిస్తోంది. స్పోర్ట్స్ యాంకర్ రిధిమా పాఠక్ ఎవరు..? రిధిమా పాఠక్ స్వస్థలం జార్ఖండ్. ఆమె తండ్రి పేరు సురేష్ కుమార్ పాఠక్, ఆయన సైన్యంలో పనిచేశారు. రిధిమా ఒక సుప్రసిద్ధ స్పోర్ట్స్ యాంకర్, ప్రజెంటర్. ఆమె అనేక ఐసీసీ ఈవెంట్లలో యాంకరింగ్ చేస్తూ కనిపించారు. ఆమె విద్య విషయానికి వస్తే రిధిమా రాంచీలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి, ఆ తర్వాత పూణే నుండి ఎలక్ట్రానిక్స్ , టెలికమ్యూనికేషన్స్‌లో ఇంజనీరింగ్ డిగ్రీని పొందారు.

## వైభవ్ సూర్యవంశీకి టీమిండియా పిలుపు?



ఐపీఎల్ వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని టీమిండియాలోకి తీసుకురావాలనే వాదన చాలా బలంగా వినిపిస్తోంది. లెజెండ్రీ క్రికెటర్ల దగ్గర నుంచి సామాన్య అభిమాని వరకూ వైభవ్ టీమిండియాలోకి రావాలనే కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ కూడా అటువైపు అడుగులు వేస్తోంది. సూర్యవంశీకి జాతీయ జట్టులో చోటు కల్పించాలని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ కూడా తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా సూర్యకుమార్ యాదవ్ స్థానంలో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటిదార్‌ను ఆడించాలని చూస్తోంది. టీమిండియా టీ20 వరల్డ్‌కప్ అందించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ శకం ఇక దాదాపు ముగిసినట్టే. ఇప్పటికే సూర్యకుమార్ యాదవ్‌ను టీమిండియా టీ20 కెప్టెన్‌గా తొలగిస్తున్నారనే వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఆ ప్లేన్‌లో సర్పంచ్ సాబ్ శ్రేయాస్ అయ్యర్‌ను నూతన కెప్టెన్‌గా నియమిస్తున్నారని కూడా తెలుస్తోంది. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2024, 2026లో వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్.. ఇప్పుడు మూడోసారి టైటిల్ గెలిచి రికార్డు సృష్టించాలని ఉంది. దాంతో టీ20 వరల్డ్‌కప్ 2028 టార్గెట్‌గా బీసీసీఐ అడుగులు వేస్తోంది. ఆ క్రమంలోనే సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించనున్న బీసీసీఐ.. యువ ఆటగాళ్లు, అనుభవం ఉన్న ప్లేయర్లతో జట్టును సిద్ధం చేయాలని ఫిక్స్ అయినట్టుంది. ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీతో పాటు రెండుసార్లు ఆర్సీబీని ఛాంపియన్‌గా నిలిపిన రజత్ పటిదార్‌ను



టీ20 జట్టులోకి తీసుకురావాలని బీసీసీఐ ప్లాన్ చేస్తోంది. కేవలం 15 ఏళ్ల వయస్సులోనే జాతీయ జట్టులో చోటు కల్పించడం సరైనదేనా? అనే చర్చ జరుగుతున్నప్పటికీ.. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ మాత్రం సూర్యవంశీకి టీమిండియా క్యాప్ అందించాలని చాలా సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను పూర్తిగా తొలగిస్తే అతని స్థానంలో నెంబర్ 4లో రజత్ పటిదార్‌ను ఆడిస్తే బాగుంటుందేమో అని బీసీసీఐ పరిశీలిస్తోంది. పటిదార్ కెప్టెన్సీలో ఆర్సీబీ వరుసగా రెండు ఐపీఎల్ టైటిల్స్ గెలవడమే కాకుండా.. కెప్టెన్ ధోనీ, రోహిత్ శర్మ సరసన కూడా నిలిచాడు. దాంతో పాటు ఐపీఎల్ 2026లో కెప్టెన్‌గా సక్సెస్ కావడమే కాకుండా 192.69 స్ట్రయిక్ రేట్‌తో 501 పరుగులు కూడా చేసి సత్తా చాటాడు. టీమిండియాలోకి వైభవ్‌ను వీలైనంత త్వరగా తెచ్చేందుకు బీసీసీఐ చాలా ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే సూర్యవంశీని ఈ నెలలో శ్రీలంకలో జరగనున్న ఇండియా - ఏ, అఫ్ఘనిస్థాన్ - ఏ, శ్రీలంక - ఏ మధ్య జరగనున్న ట్రై సిరీస్‌కు కూడా స్క్వాడ్‌లో సెలెక్ట్ చేశారు. ఈ సిరీస్‌లో వైభవ్ తన సత్తా చాటితే రానున్న కాలంలో టీమిండియాలో అడుగుపెట్టడం ఖాయమనే చెప్పొచ్చు.

## సూర్యకుమార్ యాదవ్‌పై వేటు

పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై భారత సెలెక్టర్లు వేటు వేసినట్లు తెలుస్తోంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 గెలిచినా అతన్ని కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించేందుకు అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. గతేడాదిగా సూర్యకుమార్ యాదవ్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. దాంతోనే జట్టు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుందని ఓ అధికారి మీడియాకు తెలిపారు. అప్‌కమింగ్ సిరీస్‌ల్లోనూ అతనికి చోటు దక్కే అవకాశం లేదని స్పష్టం చేశారు. 'సూర్యకుమార్ యాదవ్‌ను టీ20 కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని బీసీసీఐ నిర్ణయించింది. అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్ సారథ్య బాధ్యతలు చేపడుతాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్తో జరిగే టీ20 సిరీస్‌ల్లో టీమిండియాను శ్రేయస్ అయ్యర్ నడిపిస్తాడు. గతంలో సూర్యకుమార్ యాదవ్ ఆడిన నాలుగో నంబర్ స్థానంలో శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌కు దిగుతాడు. యువ బ్యాటర్ తిలక్ వర్మను వైస్ కెప్టెన్‌గా నియమించనున్నారు. టీ20 ప్రపంచకప్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్న అక్షర్ పటేల్‌ను ఈసారి పరిగణనలోకి తీసుకోలేదు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. సంజు శాంసన్‌ను కెప్టెన్‌ను చేయాలని కోరాడు. కానీ అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ అందుకు అంగీకరించలేదు. సంజూ బ్యాటింగ్‌లో నిలకడ లేదని సాకుగా చూపారు. ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చినప్పటికీ.. సంజూను కెప్టెన్ చేసేందుకు అంగీకరించలేదు. చివరికి శ్రేయాస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా.. తిలక్ వర్మను వైస్ కెప్టెన్‌గా నియమించడానికి అందరూ అంగీకరించారు. ఈ చర్చల్లో రజత్ పటీదార్ పేరు ప్రస్తావనకు రాలేదు.'అని సదరు అధికారి వెల్లడించాడు.

## రోహిత్, కోహ్లీ వన్డే సిరీస్ ఆడతారా?

- ఫిట్‌నెస్‌పై కొనసాగుతున్న సస్పెన్స్



అఫ్ఘానిస్థాన్‌తో జూన్ 13 నుంచి ప్రారంభం కానున్న 3 వన్డేల సిరీస్‌లో భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడతారా లేదా అనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. గాయాల కారణంగా వీరిద్దరూ దూరమవుతున్నారంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై భారత అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే స్పందించారు. ఫిట్‌నెస్ ప్రోటోకాల్స్ అందరికీ ఒకేలా ఉంటాయని, వైద్య బృందం నివేదిక ఆధారంగా త్వరలోనే అధికారిక నిర్ణయం ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు. టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ .. ప్రస్తుతం టెస్ట్, టీ20లకు గుడ్‌బై చెప్పి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్‌లో ఆడటమే లక్ష్యంగా వీరిద్దరూ అడుగులు వేస్తున్నారు. ఇక స్వదేశంలో జూన్ 13 నుంచి అఫ్ఘానిస్థాన్‌తో భారత్ వన్డే సిరీస్‌లో ఆడనుంది. మొత్తంగా మూడు వన్డే మ్యాచ్‌లు ఈ సిరీస్‌లో జరుగుతాయి. ఇందుకోసం ఎంపిక చేసిన జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ రోహిత్, కోహ్లీలు ఈ సిరీస్‌లో ఆడేది అనుమానంగా మారింది. ధర్మశాల వేదికగా తొలి వన్డే జరగనుంది. శుభమన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు ఈ సిరీస్‌లో తలపడనుంది. అయితే గాయాల కారణంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. వన్డే సిరీస్‌కు దూరమవుతారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై రకరకాల వార్తలు వస్తున్నాయి. రోహిత్ దూరమయ్యాడని.. కోహ్లీ ఆడతాడా లేడా అనేది తేలాల్సి ఉందని సోషల్ మీడియాలో నెటిజన్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భారత అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే ఈ విషయంపై అప్‌డేట్ ఇచ్చాడు. "బయట ఎలాంటి చర్చ జరిగినా అనవసరం. అధికారికంగా మేం త్వరలోనే సమాచారం ఇస్తాం. విరాట్ కోహ్లీ లేదా రోహిత్ శర్మ వంటి పెద్ద ఆటగాళ్లు సిరీస్‌లో ఆడకపోవడం బిగ్ న్యూస్ అవుతుందని తెలుసు. ఫిట్‌నెస్‌కు సంబంధించి ప్రోటోకాల్స్ అందరికీ ఒకేలా ఉంటాయి. సిరీస్ ప్రారంభానికి ఇంకొంత సమయం ఉంది. ఆలోగా మేం నిర్ణయం తీసుకుంటాం. ఫిట్‌గా ఉంటే తుది జట్టులో ఉంటారు. లేకపోతే అందుకు తగినట్టుగా మార్పులు చేసుకుంటాం. వైద్య బృందం నిర్ణయం తర్వాత.. ఆయా ఆటగాళ్ల పరిస్థితిపై అధికారికంగా స్పందిస్తాం" అని టెన్ డస్కటే చెప్పాడు.

### వన్డే సిరీస్ కోసం భారత జట్టు..

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబె.

కొమురం భీమ్
Komurambheem Telugu Daily


కొమురం భీమ్

సినిమా

# సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా

## 'బుక్ మై షో'లో గంటకు 40వేల టికెట్స్ బుక్

ప్రస్తుతం సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా కనిపిస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా వాటిని అందుకొని హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకువచ్చిన విషయం తెలిసిందే. రిలీజ్‌కు ముందు నుంచే టికెట్ బుకింగ్స్‌లో జోరు చూపిన చిత్రం విడుదల అనంతరం కూడా అదే కొనసాగిస్తోంది. ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్ 'బుక్ మై షో'లో 'పెద్ది'కు గంటకు 40వేల టికెట్స్ బుక్ అవుతున్నాయి. 2023లో బుక్‌మై షో ప్రవేశపెట్టిన 'అవర్లీ ట్రెండింగ్' ఫీచర్ తర్వాత.. ఈ 40 వేల మార్క్‌ను దాటిన చిత్రాల జాబితాలో ఇప్పటివరకు మూడు సినిమాలు మాత్రమే ఉన్నాయి. కల్కి 2898 ఏడీ, సలార్, పుష్ప తర్వాత స్థానంలో 'పెద్ది' నిలిచింది. మొదటిరోజే ఈ మార్క్‌ను చేరుకొని రికార్డు సృష్టించింది. కర్ణాటకలో జరిగిన ప్రీమియర్ షోల ద్వారా 'పెద్ది' భారీ వసూళ్లను సాధించి, టాలీవుడ్‌లోని పలు అగ్రహీరోల చిత్రాల రికార్డులను తిరగరాసింది. ప్రీమియర్స్‌లో రూ. 3.2 కోట్లు వసూలు చేసినట్లు సినీ వర్గాలు తెలిపాయి. దీంతో అక్కడ ప్రీమియర్ కలెక్షన్స్ సాధించిన మొదటి తెలుగు సినిమాగా నిలిచింది. గతంలో విడుదలైన 'ఓజీ' (రూ. 2.72 కోట్లు), 'రాజా సాబ్' (రూ. 2.61 కోట్లు), పుష్ప 2 (రూ. 2.55 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాలో పాటలు కూడా సూపర్ హిట్‌గా నిలిచాయి. ముఖ్యంగా 'చికిరి చికిరి' పాట విడుదలైన రెండు వారాలకే 10 కోట్లకు పైగా వ్యూస్‌తో ట్రెండింగ్‌లో నిలిచింది. అయితే, ఈ పాట లిరిక్స్‌లో 'సరుకూ సామాన్లు' అనే పదంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో టీమ్ ఈ పదాన్ని మార్చినట్లు తెలుస్తోంది. థియేటర్‌లలో దీనికి బదులుగా 'సొగసు సింగారం' అని చేర్చారని నెటిజన్లు పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ స్పోర్ట్స్ డ్రామాకు ఏఆర్ రెహమాన్ సంగీతం హైలైట్‌గా నిలిచింది






## పెద్ది థియేటర్‌లో ఉపాసన హంగామా

తన ఆటలతో అభిమానులకు ఫుల్ ట్రీట్ ఇచ్చాడు రామ్ చరణ్. ఆయన హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' థియేటర్‌లలో సందడి చేస్తోంది. ఈ చిత్రం ప్రీమియర్స్‌లో రామ్ చరణ్ భార్య ఉపాసన ఎంజాయ్ చేశారు. హైదరాబాద్ బాలానగర్‌లో స్పెషల్ స్క్రీనింగ్‌కు వచ్చిన ఉపాసన , అభిమానుల మధ్య సినిమా చూసి వారిలో ఉత్సాహం నింపారు. రామ్ చరణ్ ఎంట్రీ సమయంలో పేపర్‌లు ఎగరేసి జోష్ పెంచారు. ఫ్యాన్స్‌తో పాటు ఆమె కూడా ఉత్సాహంగా అరుస్తూ కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇక పెద్ది హిట్ టాక్ రావడంతో థియేటర్‌ల వద్ద పండగ వాతావరణం నెలకొంది. రామ్ చరణ్ నటనను ప్రశంసిస్తూ సెలబ్రిటీలు పోస్ట్‌లు పెడుతున్నారు. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందంటూ అభినందిస్తున్నారు.

## త్వరలోనే ఇరుముడి థీమ్ సాంగ్ విడుదల


మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'ఇరుముడి' నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఒక సాలిడ్ అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటికే ఈ మూవీ నుంచి గ్లింప్స్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి ఒక ప్రత్యేకమైన సాంగ్ అప్‌డేట్‌ను మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా పంచుకున్నారు. గత కొన్ని రోజులుగా అభిమానుల నుంచి వస్తున్న భారీ రిక్వెస్ట్‌లను పరిగణనలోకి తీసుకుని, ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ 'ఇరుముడి' థీమ్ సాంగ్‌ను త్వరలోనే విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ పాట 'విల్లాది వీరుడు వీర మణికంఠుడు' అనే పవర్‌ఫుల్ అయ్యప్ప స్వామి భక్తి గీతంగా ఉండబోతోందని తెలుస్తుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, ఇందులో రవితేజ ఒక ఎమోషనల్ తండ్రి పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. కూతురి కోసం ఒక తండ్రి పడే తపన, మద్యపానానికి దూరమై అయ్యప్ప దీక్ష స్వీకరించి ఆధ్యాత్మిక మార్గంలో సాగే ఒక ఎమోషనల్ అండ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా కథాంశం ఉండబోతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కూతురిగా కీలక పాత్ర పోషిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అద్భుతమైన





సంగీతాన్ని అందిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఆగస్టులో థియేటర్లలోకి రానుంది.

## దురంధర్ సరికొత్త రికార్డులు

■ మూవీ విజయంపై అంబానీ హర్షం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ హీరోగా జియో స్టూడియోస్ నిర్మించిన 'ధురంధర్' ఫ్రాంచైజీ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించిన విషయం తెలిసిందే. ఈ చిత్రం సాధించిన అసాధారణ విజయంపై రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ హర్షం వ్యక్తంచేశారు. జియో స్టూడియోస్ సాధించిన విజయాలను అభినందిస్తూ లేఖ రాశారు. 2024లో 'స్త్రీ 2', 2025లో 'ధురంధర్', 2026లో 'ధురంధర్: ది రివెంజ్' చిత్రాలతో జియో స్టూడియోస్ వరుసగా మూడేళ్లపాటు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలను అందించి ఒక అరుదైన మైలురాయిని అందుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జియో స్టూడియోస్ విడుదల చేసిన స్పై యాక్షన్ థ్రిల్లర్స్ 'ధురంధర్', 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ కలెక్షన్లలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణలో సరికొత్త బెంచ్‌మార్క్‌లను క్రియేట్ చేశాయి' అని లేఖలో పేర్కొన్నారు. ఈ సిరీస్‌లో వచ్చిన మొదటి భాగం, భారతీయ సినిమా చరిత్రలోనే అత్యధిక వసూళు సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచి సరికొత్త రికార్డు సృష్టించిందని ముకేశ్ అంబానీ తెలిపారు. థియేటర్లలో 15 వారాల పాటు హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించాయన్నారు. ఆ తర్వాత భారీ అంచనాల మధ్య విడుదలైన రెండో భాగం.. మొదటి సినిమా నెలకొల్పిన రికార్డులన్నింటినీ బద్దలు కొట్టిందని తెలిపారు. ఇది తిరుగులేని విజయమని వ్యాఖ్యానించారు. ఈ సినిమాలు రూ.3000 కోట్లకు పైగా వసూళ్లు సాధించి.. మొత్తం దేశ థియేట్రికల్ ఆదాయంలో 40శాతం వాటాను దక్కించుకున్నాయని ప్రశంసించారు.




## నా మనసంతా పెద్ది చుట్టే తిరుగుతోంది

■ పొలాచ్చి లో ఉండిపోవడంతో రాలేక పోయా
■ పెద్ది విజయంపై చిరంజీవి అభినందనలు

తాను షూటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా తన మనసంతా 'పెద్ది' దగ్గరే ఉందని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' నేడు ప్రేక్షకుల ముందుకువచ్చి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఒక తండ్రిగా, నటుడిగా తనకెంతో గర్వంగా ఉందంటూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. ఈసందర్భంగా చిత్రబృందాన్ని అభినందించారు. నేను షూటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా కూడా నా మనసంతా 'పెద్ది' దగ్గరే ఉంది. గత రెండేళ్లుగా ఈ సినిమా కోసం చరణ్ పడిన కష్టం, పెట్టిన శ్రద్ధాసక్తులు అన్నీ దగ్గర నుంచి చూశాను. ఈ రోజు ప్రేక్షకుల ప్రేమ, ప్రశంసలు చూస్తుంటే ఒక తండ్రిగా మాత్రమే కాదు, ఒక నటుడిగా కూడా ఎంతో గర్వంగా అనిపిస్తోంది. 'పెద్ది' పాత్రలో పూర్తిగా లీనం కావడానికి తను అహర్నిశలు చేసిన కృషి, పట్టుదల, నిజాయతీ ప్రతి సన్నివేశంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ కష్టానికి దక్కిన ప్రతిఫలమే ఈ విజయం అని రామ్ చరణ్‌ను చిరంజీవి ప్రశంసించారు. ఇలాంటి అద్భుతమైన కథను రాసి, అంతే అద్భుతంగా తెరపై ఆవిష్కరించిన దర్శకుడు బుచ్చిబాబుకు ప్రత్యేక అభినందనలు. అలాగే తన తొలి చిత్రాన్నే ఇంత భారీ స్థాయిలో, ఎలాంటి రాజీ లేకుండా నిర్మించిన నిర్మాత వెంకట సతీశ్ కిలారుకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నటించిన నా మిత్రుడు, 'కరునాడ చక్రవర్తి' శివరాజ్ కుమార్‌కు, అప్పలసూరి పాత్రలో అద్భుతంగా జీవించిన నా సోదర సమానుడు జగపతిబాబుకు అభినందనలు. అద్భుతమైన పాటలు, హృదయాన్ని కదిలించేలా నేపథ్య సంగీతాన్ని అందించిన ఏఆర్ రెహమాన్‌కు ప్రత్యేక అభినందనలు. ఈ సినిమా విజయంలో భాగమైన జాన్వీ కపూర్ , దివ్యేందుతో పాటు సాంకేతిక నిపుణులందరికీ కంగ్రాట్స్..' అంటూ చిత్రబృందాన్ని అభినందించారు. 'పెద్ది' సాధించిన ఈ ఘన విజయం తెలుగు సినిమాకి గర్వంగా నిలవాలని, మరెన్నో మైలురాళ్లు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

## ప్రశాంత్ నీల్‌కు ఎన్టీఆర్ బర్త్‌డే విషెస్




ఇండియన్ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ పుట్టినరోజు సందర్భంగా అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత్ నీల్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని, అలాగే వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోయే డ్రాగన్ సినిమాను గుర్తుచేస్తూ.. ఎన్టీఆర్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ట్వీట్‌లో ఎన్టీఆర్ స్పందిస్తూ.. 'పుట్టినరోజు శుభాకాంక్షలు డైరెక్టర్ గారూ.. మీరు చెప్పే కథలంత గొప్పగా ఈ ఏడాది మీకు సాగాలని కోరుకుంటున్నాను. మన కాంబినేషన్‌లో రాబోయే ప్రాజెక్ట్ కోసం, మన భవిష్యత్తు ప్రయాణం కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను ప్రశాంత్ అంటూ ఎన్టీఆర్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో ప్రశాంత్ నీల్‌ను ఉద్దేశించి ఎన్టీఆర్ కన్నడ పదం 'అవరే' (గారూ) అని సంబోధించడం ఇరు భాషల అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి ఇండస్ట్రీ హిట్ చిత్రాలతో సంచలనం సృష్టించిన ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో రాబోయే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ డ్రాగన్ పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## శ్రీవారిని దర్శించుకున్న జాన్వీకపూర్

తిరుమల శ్రీవారిని సినీ నటి జాన్వీ కపూర్ దర్శించుకున్నారు. బుధవారం అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు చేరుకున్న జాన్వీ.. గురువారం ఉదయం నటి మహేశ్వరితో కలసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. జాన్వీ కపూర్, రామ్‌చరణ్ జంటగా నటించిన 'పెద్ది' ఇవాళ విడుదలైన విషయం తెలిసిందే.

Printer, Published and Owned by YASHASHWIN PUBLICATIONS, H.No. 21-1-29/A/J/1, GODAVARIKAHNI, Dist. Peddapalli, TELANGANA STATE - 505 209.
Printers : Yashashwin Printers, Godavarikhani. Editor : MULKALA PRASAD, RNI No. : TELTEL/2019/79009, e-mail : komurambheemnews@gmail.com, Mobile : 8522024855